




సమావేశంలో మాట్లాడుతున్న నారాయణ

ఈనెలా భారమే...

- కొనసాగనున్న విద్యుత్ భారాలు
- సామాన్యులకు తీవ్ర భారం

ప్రజాశక్తి-కర్నూలు ప్రతినిధి

ప్రభుత్వం వివిధ పేర్లతో మోపిన విద్యుత్ భారం ఈ నెల కూడా కొనసాగనుంది. ట్రూఅప్, ఎఫ్‌పిపిసిఎ భారాలు వేయడంతో సామాన్యులపై తీవ్ర భారం పడనుంది...



వివిధ రూపాల్లో ప్రజలపై భారాలు మోపుతున్న రాష్ట్ర ప్రభుత్వం విద్యుత్ బిల్లుల్లో వివిధ పేర్లతో సామాన్యులపై బాదుడు వేసింది. ఫ్యూయల్ అండ్ పవర్ పర్చేజ్ కాస్ట్ అడ్జస్ట్‌మెంట్ (ఎఫ్‌పిపిసిఎ) పేరుతో ఈ నెల నుంచి సామాన్యులపై విద్యుత్ బిల్లులో భారాన్ని మోపింది. ఆ భారం ఈ నెల విద్యుత్ బిల్లుల్లోనూ కొనసాగనుంది. ఉమ్మడి కర్నూలు జిల్లా వ్యాప్తంగా 14,26,915 విద్యుత్ కనెక్షన్లు ఉన్నాయి. వాటిలో 11,19,459 గృహ విద్యుత్ (ఎల్‌టి1), 1,25,378 వాణిజ్య (ఎల్‌టి2) కనెక్షన్లు, 7,630 పారిశ్రామిక (ఎల్‌టి3) కనెక్షన్లు, 23,370 సాధారణ ప్రభుత్వ (ఎల్‌టి4) కనెక్షన్లు ఉన్నాయి. 2014-15 ఆర్థిక సంవత్సరం నుంచి 2018-19 ఆర్థిక సంవత్సరం వరకు వాడుకున్న విద్యుత్ వినియోగాన్ని 18 ఇన్‌స్టాల్‌మెంట్స్‌గా తీసి ట్రూ అప్ చార్జీలు యూనిట్‌కు అప్పట్లో వినియోగించిన యూనిట్‌కు కొన్ని పైసల చొప్పున వసూలు చేస్తున్నారని విద్యుత్ శాఖ చెబుతోంది. 2021-2022 సంవత్సరంలో ఏప్రిల్, మే, జూన్‌లో వాడుకున్న వినియోగానికి సంబంధించి అప్పట్లో వాడుకున్న వినియోగానికి యూనిట్‌కు 23 పైసలు చొప్పున ట్రూఅప్ భారం విధించారు. ఆ నెలకు సంబంధించిన విద్యుత్ బిల్లు జూన్ నెలలో వచ్చింది. అందులో సామాన్యులపై పెంపు భారం పడింది. గత ఏడాది ఆగష్టు నుంచే తొలి విడత ట్రూఅప్ ఛార్జీలను వసూలు చేస్తుండగా ఈ నెల నుంచి రెండో విడత ట్రూఅప్ ఛార్జీలను వసూలు చేస్తుండటంతో సామాన్యులపై అదనపు భారం పడుతోంది. మరో వైపు ఫ్యూయల్ అండ్ పవర్ పర్చేజి కాస్ట్ అడ్జస్ట్‌మెంట్(ఎఫ్‌పిపిసిఎ) రూపంలోనూ రాష్ట్ర ప్రభుత్వం వినియోగదారులపై తీవ్ర భారం మోపింది. 2023 ఏప్రిల్‌లో వినియోగించుకున్న వినియోగానికి యూనిట్‌కు 40 పైసలు చొప్పునకింద అదనపు చార్జీలు జూన్‌లో వసూలు చేశారు. ఇవి విద్యుత్ వినియోగదారుడికి అదనపు భారంగా మారింది. ఉమ్మడి కర్నూలు జిల్లా వ్యాప్తంగా ఒక్క నెలలోనే రూ.8.97 కోట్ల రూపంలో ఎఫ్‌పిపిసిఎ భారం వేసింది. ఈ భారాలు జులై నెలలో వచ్చే విద్యుత్ బిల్లుల్లోనూ భారం కొనసాగనుంది. దీంతో సామాన్యులపై తీవ్ర భారం పడనుంది.

సాగుభూములకు పట్టాలివ్వాలి

4న తహశీల్దార్ కార్యాలయాల ఎదుట నిరసన : వ్యకాసం

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

జిల్లావ్యాప్తంగా పేదలు సాగు చేసుకుంటున్న భూములకు, అనుభవంలో ఉన్న భూములకు అసైన్‌మెంట్ కమిటీ ఏర్పాటు చేసి పట్టాలు మంజూరు చేయాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కెవి.నారాయణ డిమాండ్ చేశారు. ఈ అంశంపై ఈనెల 4న అన్ని తహశీల్దార్ల కర్యాలయాల ముందు నిరసన తెలిపి వినతిపత్రాలు ఇవ్వాలన్నారు. ఆదివారం కార్మిక కర్షక భవన్‌లో సంఘం జిల్లా కమిటీ సమావేశం జిల్లా అధ్యక్షుడు బి.వీరశేఖర్ అధ్యక్షతన జరిగింది. నారాయణ మాట్లాడుతూ జిల్లాలో భూమిలేని నిరుపేదలు ప్రభుత్వ, బంజరు భూములను సాగు చేసుకుంటున్నారన్నారు. వైసిపి పభుత్వం వచ్చి నాలుగేళ్లయినా నేటికీ అసైన్‌మెంట్ కమిటీ జరపలేదన్నారు. నవరత్నాలలో భూములు పంచుతాననే పదాన్ని ముఖ్యమంత్రి ఎక్కడ కూడా ఉపయోగించట్లేదని చెప్పారు. పేదలు బడుగు బలహీన వర్గాల పైన ఆయనకు ఎంత ప్రేమ ఉందో దీన్ని చూస్తే అర్థమవుతుందని అన్నారు. ఇప్పటికే వైసిపి ఎమ్మెల్యేలు భూములు కబ్జాలు చేస్తున్నా, అడ్డగోలుగా బినామీ పేర్లతో రాయించుకుంటున్నా జిల్లా అధికార యంత్రాంగం, రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఎలాంటి స్పందన లేదన్నారు.

ప్రజల ఓట్లు వేస్తే ముఖ్యమంత్రి అయ్యాడా ఎమ్మెల్యే కుటుంబ సభ్యులు ఓట్లేస్తే ముఖ్యమంత్రి అయ్యారా జగన్ తెలుసుకోవా లని అన్నారు. జిల్లాలు సాగులో ఉన్న పేదలను, అర్హులైన వారిని గుర్తించి, అసైన్‌మెంట్ కమిటీలు ఏర్పాటు చేసి, వారందరికీ పట్టాలు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ఈ అంశంపై ఈనెల 4న తహశీల్దార్లకు వినతిపత్రాలు ఇవ్వాలన్నారు. రెవెన్యూ యంత్రాంగం స్పందించకుంటే తరువాత దశల వారి ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. జిల్లా ఉపాధ్యక్షులు కె.లింగన్న, ఇ.తిక్కన్న, బి.నాగన్న, సురేంద్ర, వెంకట రాముడు పాల్గొన్నారు.

ఐఎంఎ నూతన భవనం ప్రారంభం

- వైద్యులు సామాజిక సేవలో భాగస్వాములు కావాలి
- ప్రముఖ వైద్యులు డాక్టర్ నాగేశ్వర్‌రెడ్డి

ప్రజాశక్తి కర్నూలు హాస్పిటల్

కర్నూలు నగరం డాక్టర్స్ కాలనీలో నూతనంగా నిర్మించిన ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఎ) నూతన భవనాన్ని ఎఐజి హాస్పిటల్స్ చైర్మన్ డాక్టర్ నాగేశ్వర్‌రెడ్డి ఆదివారం ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో డాక్టర్ నాగేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ వైద్యులు తమ సొంత పనులతో పాటు సామాజిక సేవా కార్యక్రమాల్లో భాగస్వాములు కావాలన్నారు. వైద్యులు వ్యాపార దృక్పథంతో పాటు సేవా దృక్పదానికి ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. ఐఎంఎ భవన ప్రారంభోత్సవానికి పిలిచినందుకు అభినందలు తెలిపారు. టిజివి సంస్థల చైర్మన్ టిజి. భరత్ మాట్లాడుతూ వైద్యులు కనిపించే దేవుళ్ళు అని అన్నారు. మంచి కార్యక్రమాలకు టిజివి సంస్థల సహకారం ఎప్పటికీ ఉంటుందని అన్నారు. టిజివి సంస్థల తరపున ఈ భవన నిర్మాణానికి రూ.50 లక్షలు ఇదివరకే విరాళంగా అందించామని తెలిపారు. కర్నూలు వైద్య కళాశాలకు ఎంతో పేరు ఉందని, అలాంటిది ఇంతవరకు కర్నూల్లో ఐఎంఎకు భవనం లేకపోవడం దురదృష్టకమన్నారు. ఇప్పటికైనా నూతన భవనం నిర్మించుకోవడం చాలా సంతోషంగా ఉందన్నారు. ప్రపంచవ్యాప్తంగా పేరుగాంచిన గ్యాస్ట్రో ఎంటరాలజీ వైద్యులు నాగేశ్వర్‌రెడ్డి ఈ కార్యక్రమానికి హాజరవడం గొప్ప విషయమన్నారు. కరోనా సమయంలో ఎంతోమంది ప్రాణాలను ఎఐజి హాస్పిటల్ బ్రతికించిందన్నారు. ఐఎంఎ భవన నిర్మాణానికి సహకరించిన ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలుపుతున్నట్లు భరత్ అన్నారు. అతిథులు ఎవిఎస్‌రెడ్డి, విక్రమ సింహారెడ్డి, రామచంద్రనాయుడు, రమేష్, ఐఎంఎ అసోసియేషన్ సభ్యులు, ప్రముఖ వైద్యులు డాక్టర్ శంకర్‌శర్మ, డాక్టర్ బాలమద్దయ్య, డాక్టర్ కెజి గోవిందరెడ్డి, ఆంద్రూస్ జేసుదాస్, పాల్గొన్నారు.



నూతన భవనాన్ని ప్రారంభిస్తున్న అతిథులు

కర్నూలు అవతరణ దినోత్సవాన్ని ప్రభుత్వం నిర్వహించాలి

- ప్రభుత్వ అదనపు కమిషనర్ మహమ్మద్ ఇంతియాజ్‌కు వినతి

ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్

కర్నూలు జిల్లా 165వ అవతరణ దినోత్సవం సందర్భంగా కర్నూల ఉత్సవాన్ని ప్రభుత్వం నిర్వహించేలా ప్రయత్నించాలని జిల్లా మేధావుల బృందం ప్రభుత్వ మైనారిటీ సంక్షేమ శాఖ కార్యదర్శి మహమ్మద్ ఇంతియాజ్‌కు వినతిపత్రం అందజేశారు. కర్నూలు చరిత్రలో జులై, అక్టోబర్, నవంబర్ మాసాలు ఎంత ప్రాముఖ్యతను కలిగి ఉన్నాయో వివరించారు. ప్రభుత్వ అదనపు కమిషనర్‌కు 'కర్నూలు ఉత్సవ' ప్రాతిపాదనలు అందజేశారు. ఈ వేడుకలు రాష్ట్ర సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో జరిగే విధంగా సహకరించాలని కోరారు. కర్నూలు వైభవం సమన్వయకర్త ఆచార్య మన్సూర్ రహ్మాన్, అధ్యాపకులు డాక్టర్ అఖ్తర్‌భాను, మహబూబ్‌బాషా, పాత్రికేయులు ఖుద్రతుల్లా ఖాద్రి, ఇంతియాజ్, బ్యాంకు అధికారి దావూద్ పాల్గొన్నారు.



వినతిపత్రం అందజేస్తున్న మన్సూర్ రహ్మాన్, తదితరులు

నాణ్యమైన విద్యుత్ అందించడమే లక్ష్యం

- గతేడాది పూర్తి స్థాయిలో వ్యవసాయ కనెక్షన్లు - ప్రజాశక్తితో విద్యుత్ ఎస్ఇ ఉమాపతి

ప్రజాశక్తి - కర్నూలు కార్పొరేషన్

అంతరాయం లేని నాణ్యమైన విద్యుత్ అందించడమే ప్రధాన లక్ష్యమని ఎపి ఎస్‌పిడిసిఎల్ ఉమ్మడి కర్నూలు జిల్లా ఎస్ఇ ఎం.ఉమాపతి తెలిపారు. విద్యుత్ మానవుని జీవితంలో ఒక ముఖ్య భాగమైంది. అది లేనిదే ఏ పని ముందుకు సాగడం లేదన్నారు. ప్రజాశక్తితో ముఖాముఖి ద్వారా ఆయన మాట్లాడారు..



ఉభయ జిల్లాల్లో ఏయే రకమైన విద్యుత్ వినియోగదారులు ఎంతమంది ఉన్నారు..?

ఎస్ఇ : గృహ విద్యుత్ వినియోగానికి సంబంధించి కర్నూలు జిల్లాలో 6,70,000, నంద్యాలలో 5 లక్షల విద్యుత్ వినియోగదారులు ఉన్నారు. కర్నూలు జిల్లాలో 86,000, నంద్యాలలో 59,000 వ్యాపార విద్యుత్ కనెక్షన్లు ఉన్నాయి. కర్నూలు జిల్లాలో 3500, నంద్యాల జిల్లాలో 6,305 పారిశ్రామిక కనెక్షన్లు ఉన్నాయి. కర్నూలు జిల్లాలో వ్యవసాయ కనెక్షన్లు 1,08,000, నంద్యాలలో 1,06,000 ఉన్నాయి.

2021-22వ సంవత్సరంలో వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లకు ఎంతమంది దరఖాస్తు చేసుకున్నారు..?

ఎస్ఇ : గత సంవత్సరం దరఖాస్తు చేసుకున్న వారందరికీ వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లు పూర్తిస్థాయిలో ఇచ్చాం. ఏప్రిల్, మే నెలలో 15 పెండింగ్‌లో ఉన్నాయి. మే, జూన్ నెలలో 850 పెండింగ్‌లో ఉన్నాయి.

ఎపి ఎస్‌పిడిసిఎల్‌లో ఎంతమంది ఉద్యోగులు పని చేస్తున్నారు..?

ఎస్ఇ : ఎపి ఎస్‌పిడిసిఎల్‌లో కర్నూలు ఉమ్మడి జిల్లాలో రెగ్యులర్ ఉద్యోగులు 1650 మంది, కాంట్రాక్టు ఉద్యోగులు 1600 మంది పని చేస్తున్నారు.

రోజూ ఎంత విద్యుత్ వినియోగం అవుతుంది..?

ఎస్ఇ : రోజుకు 13 మిలియన్ యూనిట్లు విద్యుత్‌ను వినియోగిస్తున్నారు.

ప్రభుత్వ కార్యాలయం నుంచి విద్యుత్ బిల్లులు ఎంత పెండింగ్ ఉన్నాయి..?

ఎస్ఇ : రెండు జిల్లాల్లో ప్రభుత్వ కార్యాలయాల నుంచి రూ.120 కోట్లు, ప్రయివేట్ కార్యాలయాల నుంచి రూ.130 కోట్ల మొత్తం రూ.250 కోట్లు బకాయిలు ఉన్నాయి. ఇటీవల గురు రాఘవేంద్ర ప్రాజెక్టు నుంచి రూ.20 కోట్ల వసూలు అయ్యాయి. వినియోగదారుల నుంచి ప్రతినెలా బిల్లులు సక్రమంగా వసూలవుతున్నాయి.

రిజిస్టర్ కాంట్రాక్టర్లు ఎంతమంది ఉన్నారు..?

ఎస్ఇ : రిజిస్టర్ కాంట్రాక్టర్లు వందమంది ఉన్నారు.

ఎన్ని సబ్ స్టేషన్లు ఉన్నాయి..? మెరుగైన విద్యుత్‌ను వినియోగదారులకు అందించేందుకు ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు..?

ఎస్ఇ : ఉమ్మడి జిల్లాలో 245 సబ్ స్టేషన్‌లు ఉన్నాయి. వినియోగదారులకు మెరుగైన విద్యుత్‌ను అందించేందుకు ఉద్యోగులను పని ప్రదేశాల్లోనే ఉండేటట్లు చర్యలు తీసుకున్నాం. ఎప్పటికప్పుడు ముందుగా లైన్లను పరిశీలించి, అవసరాన్ని బట్టి అదనపు ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేస్తున్నాం. ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోతే టౌన్‌లో 12 గంటల్లోపు, గ్రామీణ ప్రాంతాల్లో 24 గంటల్లోపు ట్రాన్స్‌ఫార్మర్లను మారుస్తున్నాం. ఎప్పుడు, ఎక్కడ, ఎలాంటి సమస్య వచ్చినా వెంటనే సరి చేసే విధంగా సిబ్బందిని సిద్ధంగా ఉంచాం. విద్యుత్ అంతరాయం లేకుండా వినియోగదారులకు అందిస్తున్నాం.

విద్యుత్ సమస్యలు ఎన్ని పరిష్కరించారు..?

ఎస్ఇ : విద్యుత్ సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తున్నాం. ఇళ్ల మీద ఉన్న లైన్ల సమస్య మాత్రమే పెండింగ్‌లో ఉన్నాయి.

అక్రమ కనెక్షన్లు ఎన్ని ఉన్నాయి..?

ఎస్ఇ : అక్రమ కనెక్షన్లు లేవు. అక్రమ కనెక్షన్లు ఉన్నట్లు మా దృష్టికి వస్తే వెంటనే తొలగించి కేసులు నమోదు చేస్తున్నాం.

సర్దుబాటు పేరుతో విద్యుత్ వినియోగదారులపై ఎంత భారం వేశారు..?

ఎస్ఇ : సర్దుబాటు పేరుతో జూన్ నెలలో ప్రజలపై రూ.162 కోట్ల భారం పడింది.

వర్షాకాలంలో ప్రమాదాలు జరగకుండా ఉండేందుకు ఎలాంటి జాగ్రత్తలు తీసుకుంటున్నారు..?

ఎస్ఇ : వర్షాకాలంలో విద్యుత్ ద్వారా ప్రమాదాలు జరగకుండా ముందు జాగ్రత్త చర్యల్లో భాగంగా ప్రజల్లో అవగాహన కల్పించే కార్యక్రమాలు చేస్తున్నాం. ప్రతి గృహ వినియోగదారులు ఇళ్లలో క్వాలిటీ గల స్విచ్లు, ప్లగ్గులను వాడాలి. ఎర్తింగు తప్పనిసరిగా ఏర్పాటు చేసుకోవాలి. గాలి, వాన కురిసిన సందర్భాల్లో తీగలు తెగిపడవచ్చు. అలాంటి సందర్భాల్లో ఎవరు కూడా తడి చేతులతో పట్టుకోరాదు, పచ్చి కర్రలతో తొలగించరాదు. ప్రతి ట్రాన్స్ఫార్మర్ దగ్గర ఎర్తింగ్ ఏర్పాటు చేసుకోవాలి. విద్యుత్ తీగల ద్వారా ఏమైనా ప్రమాదాలు జరిగే అవకాశం ఉన్నట్లయితే వెంటనే సమీపంలోని సబ్ స్టేషన్ కానీ, ఏఈకి గాని తెలియజేయాలి. శిక్షణ పొందిన విద్యుత్ శాఖకు చెందిన వారు మాత్రమే స్తంభాలను ఎక్కాలని మిగతావారు ఎక్కి ప్రమాదాలు కొని తెచ్చుకోవద్దు. అత్యవసర పరిస్థితులలో 1912కు ఫోన్ చేసి తెలపాలి. వినియోగదారులు సకాలంలో బిల్లులు చెల్లించి నాణ్యమైన విద్యుత్తును అంతరాయం లేకుండా అందించేందుకు, సంస్థ అబివృద్ధికి పాటుపడాలి.



వైద్య పరిశోధనా కేంద్రానికి రూ.25 కోట్లు

అల్యూమిని కంపెనీ హామీ

డల్లాస్‌లో నాట ఉత్సవాల్లో ఎమ్మెల్యే హఫీజ్ ఖాన్

ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్

కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో వైద్య పరిశోధన కేంద్రాన్ని ఏర్పాటు చేయడం కోసం ప్రముఖ వైద్య పరిశోధనా సంస్థ అల్యూమినియం కంపెనీ హామీనిచ్చిందని కర్నూలు ఎమ్మెల్యే ఎంఎ.హఫీజ్ ఖాన్ అన్నారు. అమెరికాలోని డల్లాస్‌లో నిర్వహిస్తున్న నాట ఉత్సవాలకు ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా అల్యూమిని కంపెనీ యాజమాన్యం పెద్దలతో ఏర్పాటు చేసిన సమావేశంలో కర్నూలు ప్రభుత్వ సర్వేన వైద్యశాలలో రూ.25 కోట్లు పెట్టుబడులను వెచ్చించేందుకు హామీ ఇచ్చారని ఆయన పేర్కొన్నారు. కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి జిల్లా ప్రజలకు ఓ వరంగా దీన్ని ఆయన అభివర్ణించారు.



నాట ఉత్సవాల్లో ఎమ్మెల్యే హఫీజ్‌ఖాన్

శాంతిభద్రలతలపై అలసత్వాన్ని సహించం

పత్తికొండ డిఎస్‌పి శ్రీనివాసరెడ్డి

ప్రజాశక్తి-పత్తికొండ



పత్తికొండ డివిజన్ పరిధిలో ప్రజలకు శాంతిభద్రతల పట్ల పోలీసులు అలసత్వం వహిస్తే ఏమాత్రం సహించబోమని డిఎస్‌పి శ్రీనివాసరెడ్డి అన్నారు. డిఎస్‌పి కార్యాలయం ఏర్పడి ఏడాది పూర్తి చేసుకున్న సందర్భంగా ఆదివారం ఆయన ప్రజాశక్తితో మాట్లాడారు. ఇక్కడే ఈ డివిజన్ పరిధి కింద దేవనకొండ, తుగ్గలి, మద్దికెర, ఆస్పరి, ఆలూరు, పత్తికొండ, కృష్ణగిరి, వెల్దుర్తి, హోళగుంద, చిప్పగిరి, హాలహర్వి, జొన్నగిరి, పోలీస్ స్టేషన్స్ ఉండగా ప్రజలకు పోలీసులు సేవలు మరింత దగ్గర చేయాలన్న కాంక్షతో కప్పట్రాళ్ల, అలిగిరి, కడమకుంట్ల, కోటకొండ, బోయ బొంతిరాల, చెరుకులపాడులో అవుట్ పోస్టు పోలీస్ స్టేషన్లను ఏర్పాటు చేశామన్నారు. మొత్తానికి నలుగురు సిఐలు,13 మంది ఎస్ఐలు, 21 మంది ఎఎస్ఐలు, 39 హెడ్ కానిస్టేబుళ్లు , 142 కానిస్టేళ్లు, 13 మహిళా కానిస్టేబుళ్లు ఇలా 232 మంది ప్రజలకు సేవలందిస్తున్నట్లు పేర్కొన్నారు. డివిజన్ పరిధిలోని ఆస్పరి, వెల్దుర్తి, కష్ణగిరి, దేవనకొండ మండలాలు సమస్యాత్మకంగా రికార్డుల్లోకెక్కాయన్నారు. అవుట్ పోస్టు పోలీస్ స్టేషన్ గ్రామాలు కూడా అదే తరహాలో ఉండగా నానాటికి గొడవలు తగ్గి ప్రశాంత జీవితాలు గడు పుతున్నారని అన్నారు. కొందరు ఆధిపత్య ధోరణి వీడటం లేదని, మార్పు కోసం గట్టి చర్యలు చేపట్టామని, ఇందులో మీడియా సహకారం ఉండాలని కోరారు. ప్రజలు ఫ్యాక్షన్‌కు, వివాదాలకు దూరంగా ఉండాలని, చిన్న పాటి ఘర్ష ణలు పడి క్షణికావేశాలకు పోయి జరగరాని నష్టా లను, కష్టాలను కొని తెచ్చుకొంటు న్నారని, మొత్తానికి కుటుంబాలకు దూరమ వుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామాల్లో అక్రమ మద్యం, దూమపానం, గుట్కా, మట్కా, జూదం, చెడు వ్యసనాలకు యువతను దూరంగా ఉంచాలన్నారు.

పోరాటాలకు సిద్ధం కావాలి : సిఐటియు

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

కేంద్రరాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న కార్మిక ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా కార్మికుల పోరాటాలకు సిద్ధం కావాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు గౌస్ దేశాయ్, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండి అంజిబాబు కార్మికులను కోరారు. ఆదివారం కర్నూలు కార్మిక కర్షక భవన్‌లో సిఐటియు జిల్లా అధ్యక్షులు పిఎస్. రాధాకృష్ణ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో వారు మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కార్మిక వ్యతిరేక విధానాల అవలంబిస్తున్నాయని విమర్శించారు. కాంట్రాక్టు కార్మికులను రెగ్యులర్ చేస్తానని హామీ ఇచ్చిన ప్రభుత్వ అధినేతలు రెగ్యులర్ చేయకుండా కాంట్రాక్ట్ కార్మికులను మోసం చేస్తున్నారని విమర్శించారు. కనీస వేతనం అమలు చేస్తామని సమాన పనికి సమాన వేతనం ఇస్తామని చెప్పిన నేతలు హామీలను బుట్ట దాఖలు చేస్తున్నారని విమర్శించారు. రోజురోజుకీ ప్రజలపై భారాలు వేస్తూ ప్రజల నడ్డి విరుస్తున్నారని విమర్శించారు. పెట్రోల్ రేట్లు పెంచడం, విద్యుత్ చార్జీలను పెంచడం వస్తువుల ధరలను పెంచడం వల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని అన్నారు. ఈ సమావేశంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు బి.రామాంజనేయులు, శ్రామిక మహిళా కన్వీనర్ పి.నిర్మల,సిఐటియు జిల్లా నాయకులు ప్రభాకర్, నాగేశ్వరరావు, విజయ్, సాయిబాబా, నాగరాజు, ఎం. గోపాల్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న పిఎస్.రాధాకృష్ణ

సీనియారిటీ తోనే పదోన్నతులు : ఫ్యాప్టో

పజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

ఉమ్మడి సీనియారిటి ద్వారానే పదోన్నతులు కల్పించాలని లేనియెడల ఫ్యాప్టో ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని కర్నూలు జిల్లా ఫ్యాఫ్టో చైర్మెన్, ఎస్. గోకారీ, సెక్రటరీ జనరల్ తిమ్మప్పలు డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక సలాం ఖాన్ భవన్లో జిల్లా ఫాఫ్టో ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. నాయకులు మాట్లాడుతూ ఈ ప్రభుత్వ యాజమాన్య ఉపాధ్యాయులకు మండల విద్యాధికారి 1, డివిజన్ స్థాయి ఉపవిద్యాధికారి పోస్టులు ప్రమోషన్ ఇస్తామనడం రాజ్యాంగ విరుద్ధమన్నారు. కచ్చితంగా ఉమ్మడి సీనియారిటీ ఆధారంగానే పదోన్నతులు కల్పించేలా ప్రభుత్వం ఉత్తర్వులు సవరించాలన్నారు. లేనియెడల రాష్ట్రవ్యాప్తంగా ఫ్యాప్టో ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళనలకు సిద్ధమవుతామని, అవసరమైతే న్యాయస్థానాన్ని కూడా ఆశ్రయిస్తామన్నారు. జీవో నెంబర్ 117 అమలు చేయడం ద్వారా ప్రాథమిక పాఠశాలలో భవిష్యత్తులో కనుమరుగయ్యే అవకాశం ఉందన్నారు. పేద విద్యార్థులకు బడుగు బలహీన వర్గాల విద్యార్థులకు విద్య దూరమయ్యే ప్రమాదం ఉందని హెచ్చరించారు. ఇప్పటికైనా ప్రభుత్వం విద్యారంగ సమస్యల పైన ఉపాధ్యాయుల ఉమ్మడి సర్వీసు సమస్యల పైన ఉపాధ్యాయ సంఘాలతో చర్చించి ముందుకెళ్లాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్‌టియు జిల్లా ప్రధాన కార్యదర్శి టికె.జనార్ధన్, యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.జయరాజు, ఎపిటిఎఫ్ 1938 జిల్లా అధ్యక్షులు ఎస్.ఇస్మాయిల్, అప్తా జిల్లా ప్రధాన కార్యదర్శి సేవానాయక్ పాల్గొన్నారు.

వ్యవసాయం దినచర్యను క్రమబద్ధీకరించింది

మీడియాతో ఎంపిపి బొంతల మునెప్ప



ప్రజాశక్తి-సి బెళగల్ : రెండేళ్ల క్రితం ఎంపిపిగా పదవిస్థాయిని పెంచింది.. కానీ నేను నమ్ముకున్న వ్యవసాయం సాగు నేల నన్ను ముద్దాడుతూనే ఉంది. వ్యవసాయ పనులు నా దిన చర్యను క్రమబద్ధీకరించాయని సి బెళగల్ ఎంపిపి బొంతల మునెప్ప అన్నారు. ఆదివారం తన పొలంలో పనులు చేసుకుంటూ అటుగా వెళ్తున్న మీడియా కంట పడ్డారు. రైతు దేశానికి వెన్నెముక అని రైతు లేకుంటే నలుగురికి నాలుగు మెతుకులు దొరకడం కష్టమని అన్నారు. ఐదుగురు కొడుకులు సంతానం కాగా 18 ఎకరాలు పొలం ఉందని,ఏటా ఓ పది ఎకరాలు అదనంగా సాగు చేయడం ఆసక్తిగా ఉందని పేర్కొన్నారు. అలాగే పంటలు సాగు చేస్తే నష్టాల మాటేమేమిటో గాని ఉదయమే పొలానికి నడుచుకుంటూ వెళ్లి 12 గంటలకు మండల కేంద్రానికి వెళ్లి సాయంత్రం 4 గం టలకు ఇంటికెళ్లి గంట విశ్రాంతి తీసుకోని మళ్లి పొలానికి వెళ్లి పనులు చేస్తానన్నారు. ఆహారపు అలవాట్లు కూడా ఓ క్రమ పద్ధతి లోనే ఉంటుందని ఆయన దినచర్యను చెప్పారు. ఏదీ ఏమైనా 76 ఏళ్ల వయసులో కూడా వ్యవసాయం పనులు చేయడం, నాకు ఎంతో ఆరోగ్యాన్ని, సంతృప్తిని ఇస్తుందని మీడియాతో ఆయనతో కాసేపు ముచ్చటించారు.

టిడిపి విజయమే లక్ష్యంగా పని చేద్దాం

కార్యకర్తలకు గౌరు దంపతుల సూచన

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్

రాబోయే సాధారణ ఎన్నికల్లో పార్టీ విజయమే లక్ష్యంగా పనిచేయాలని టిడిపి సీనియర్ నాయకులు గౌరు వెంకటరెడ్డి, మాజీ ఎమ్మెల్యే పాణ్యం ఇన్చార్జి గౌరు చరితారెడ్డి కార్యకర్తలకు నాయకులకు సూచించారు. ఆదివారం పాణ్యం నియోజకవర్గం కల్లూరు అర్బన్ పరిధిలో ఉన్న 16 వార్డుల ముఖ్య నాయకులు, వార్డు ఇన్‌చార్జులు, క్లస్టర్ ఇన్‌ఛార్జుల, యూనిట్ ఇంచార్జులతో, పార్టీ శ్రేణులతో వారి స్వగృహం వద్ద ప్రత్యేక సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ రాబోయే ఎన్నికలకు పని చేసేలా కార్యాచరణ సిద్ధం చేసి ప్రజల్లోకి వెళదాం అన్నారు. రానున్న రోజుల్లో తెలుగుదేశం పార్టీ విజయమే లక్ష్యంగా పని చేయాలని ఇప్పటి నుంచే ప్రజల్లో తిరిగి పథకాల గురించి వివరించాలని గౌరు దంపతులు సూచించారు. మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ పెరుగు పురుషోత్తమ రెడ్డి, తెలుగు యువత రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రభాకర్ యాదవ్, జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ అకేపోగు వెంకట స్వామి,తదితరులు పాల్గొన్నారు.



సవ్వప్పగారిఈరన్న 'మట్టిబొమ్మలు' కవితాసంపుటిని ఆవిష్కరిస్తున్న అతిథులు

సవ్వప్ప గారి ఈరన్న సాహితీ సేవను ప్రభుత్వం గుర్తించాలి

ప్రజాశక్తి-పత్తికొండ

కవి సవ్వప్పగారి ఈరన్న రచించిన పుస్తకాలకు, సాహితీ సేవలకు ప్రభుత్వం గుర్తింపు ఇవ్వాలని అరసం జిల్లా ప్రధాన కార్యదర్శి కొత్తపల్లి సత్యనారాయణ కోరారు. ఆదివారం పత్తికొండ గ్రంథాలయంలో కమలా కళా నికేతన్ సాహితీ సంస్థ ఆధ్వర్యలో అరసం జిల్లా ప్రధాన కార్యదర్శి కొత్తపల్లి సత్యనారాయణ అధ్యక్షతన సవ్వప్పగారి ఈరన్న రచించిన 'మట్టిబొమ్మలు' కవితా సంపుటి పుస్తకాన్ని రిటైర్డ్ హెడ్మాస్టర్ కాశింశెట్టి ఆవిష్కరించారు. శ్రీ కామ ధేను వన సంరక్షకులు సమ్మెటూరు ప్రతాప్ స్వామి సభను ప్రారంభించారు. డాక్టరు సక్కిరి భాస్కర్ పుస్తకాన్ని సమీక్షించారు. ముఖ్య అతిథిగాచెంచాల ఉమాపతి హాజరయ్యారు. కొత్తపల్లి సత్యనారాయణ మాట్లాడుతూ ఈరన్న గారి సాహితీ సేవను,ఆయన మాతృ భాష పరిరక్షణకు చేస్తున్న కృషిని కొనియాడారు. దాదాపు 66 పుస్తకాలను రచించి సాహితీ ప్రియులకు అందించారన్నారు.ఆయన రచనలను, తెలుగు భాషాభివృద్ధికి చేస్తున్న కృషిని ప్రభుత్వం గుర్తించి ఆర్థికంగా ఆదుకోవాలన్నారు. ప్రభుత్వం ఏదో ఒక సాహితీ పురస్కారంతో సత్కరించాలని విజ్ఞప్తి చేశారు. కవి ఈరన్నను సమ్మెటూరు ప్రతాప్‌స్వామి ,గ్రంథాలయాధికారి రామ్‌కుమార్ శాలువాకప్పి సన్మానించారు. తెలుగు లెక్చరర్ నేటూరు వెంకటేశ్వరయాదవ్ , రంగస్థల కళాకారులు రంగన్న, వెంకటేశ్వర్లు,నాగరత్నమ్మ పాల్గొన్నారు.


హనుమంతప్పను సన్మానిస్తున్న నాయకులు

పదవులు శాశ్వతం కాదు...

- విరమణ పొందిన ఎపిజిబి మేనేజర్ తలారి హనుమంతప్పకు సన్మానం

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

పదవులు శాశ్వతం కాదని పలువురు నాయకులు పేర్కొన్నారు. తలారి హనుమంతప్ప ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంక్ పెద్దకడబూరు బ్రాంచి మేనేజర్‌గా విధులు నిర్వహిస్తూ జూన్ 30న విరమణ పొందారు. ఆయనను ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ సంఘాలు, ప్రజా సంఘాలు, ఉద్యోగులు, ఉపాధ్యాయులు, వివిధ రాజకీయ పార్టీల నేతలు సన్మానించారు. ఆదివారం పట్టణంలోని రాఘవేంద్ర కాలనీలో హనుమంతప్ప స్వగృహంలో ఆత్మీయ సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్టు ఫెడరేషన్ రాష్ట్ర నాయకులు గోరంట్లప్ప, టిడిపి నాయకులు కదిరికోట ఆదెన్న, కెవిపిఎస్ జిల్లా అధ్యక్షులు ఎస్.దేవసహాయం, ఎంఆర్‌పిఎస్ రాష్ట్ర కార్యదర్శి జి.ఆనంద్ చైతన్య మాదిగ, దళిత, బహుజన రచయిత, ఉపాధ్యాయులు ఆరేకంటి భాస్కర్, ఎంఎఫ్ఎఫ్ నాయకులు, ఉపాధ్యాయులు రంగన్న, ఐటిడిపి మంత్రాలయం నియోజకవర్గ అధ్యక్షులు సాల్మన్ రాజు హనుమంతప్ప దంపతులకు శాలువా కప్పి, పూలమాలలతో సన్మానించారు. భారత రాజ్యాంగ నిర్మాత, బాబా సాహెబ్ డాక్టర్ బిఆర్.అంబేద్కర్ చిత్రపటాన్ని బహూకరించారు. పదవులు శాశ్వతం కాదని, చేసే పనులే శాశ్వతమని తెలిపారు. ప్రతి ఉద్యోగికీ విరమణ సర్వసాధారణమన్నారు. హనుమంతప్ప శేష జీవితం దళిత, బహుజన వర్గాల శ్రేయస్సు కోసం సాగాలని ఆకాంక్షించారు.

వైద్య శిబిరానికి విశేష స్పందన

ప్రజాశక్తి - ఆదోని


జ్యోతి ప్రజ్వలన చేస్తున్న నిర్వాహకులు

సంతానం లేని వారికి ఆవోపా, ప్రైమ్ ప్లస్ ఆస్పత్రి ఆధ్వర్యంలో ఆదివారం వాసవీ కల్యాణ మండపంలో నిర్వహించిన ఉచిత ఐవిఎఫ్ వైద్య శిబిరానికి విశేష స్పందన లభించిందని అధ్యక్ష, కార్యదర్శులు వంకదారు శ్రీనాథ్ గుప్త, మిరియాల శ్రీధర్ తెలిపారు. కర్నూలు ప్రైమ్ ప్లస్ ఆస్పత్రి సహకారంతో, మాజీ అధ్యక్షులు, దాత కాకుబాళ్ నాగేష్ సౌజన్యంతో చేపట్టిన ఐవిఎఫ్ మెడికల్ కౌన్సిల్‌కు భారీ స్పందన లభించిందన్నారు. దాదాపు 353 మంది సంతానం లేని దంపతులు ఈ క్యాంపునకు విచ్చేసి వైద్యుల సలహాలు తీసుకున్నారని తెలిపారు. అవసరమున్న వారికి ఉచితంగా ఐయుఐ, సెమిన్ ఎనాలిసిస్ పరీక్షల కోసం కర్నూలుకు పంపనున్నట్లు చెప్పారు. రాయలసీమలో మొట్టమొదటిసారిగా చేపట్టిన ఈ క్యాంపునకు భారీ స్పందన రావడం ఆనందంగా ఉందన్నారు. భవిష్యత్తులో మరిన్ని వైద్య క్యాంపులు నిర్వహిస్తామని తెలిపారు. హాలును ఉచితంగా కేటాయించిన వాసవీ కల్యాణ మందిరం కమిటీకి, వాలంటీర్లుగా వచ్చిన సభ్యులు, పెద్దలు, మహిళలకు మహిళా విభాగ్ అధ్యక్ష, కార్యదర్శులు సంగీత, మమతశ్రీ ధన్యవాదాలు తెలిపారు. రాచోటి సుధాకర్, విట్టా రమేష్, నగేష్, ప్రైమ్ ప్లస్ ఎమ్‌డి అజయ్‌కుమార్, డాక్టర్ గౌతమ్ చేతులమీదుగా జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ప్రతాప్, ఈరన్న శెట్టి, రంగనాయకులు, రాంప్రసాద్, రఘు, రాజగోపాల్, హిమబిందు, గీత, కవిత, లావణ్య, సౌజన్య, తులసి, యశోద, విద్య పాల్గొన్నారు.

'సంక్షేమ పథకాలతో అభ్యున్నతి'

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు


ఎమ్మెల్యే సమక్షంలో వైసిపిలో చేరుతున్న నాయకులు

ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలతో అన్ని వర్గాల ప్రజలు ఆర్థికంగా అభ్యున్నతి సాధిస్తున్నారని ఎమ్మెల్యే ఎర్రకోట చెన్నకేశవరెడ్డి పేర్కొన్నారు. ఆదివారం నందవరం మండలంలోని జోహారాపురం గ్రామానికి చెందిన పల్లె శంకర్ రెడ్డి ఆధ్వర్యంలో టిడిపికి చెందిన సుమారు 80 మంది ఎమ్మెల్యే ఎర్రకోట చెన్నకేశవరెడ్డి, వైసిపి సీనియర్ నాయకులు జగన్మోహన్ రెడ్డి సమక్షంలో వైసిపిలో చేరారు. ఎర్ర నరసింహులు, కె.నాగేంద్ర, కురువ మల్లేష్, కె.నాగరాజు, కె.పరమేష్, కె.అనుమమ్మ, కె.రమేష్, కె.యంకప్ప, కె.బుడ్డప్ప, కె.బుడ్డ నరసన్న, కె.శంకరప్పలు వైసిపిలో చేరారు. వారికి ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి పథకాలకు ఆకర్షితులై, టిడిపికి మనుగడ ఉందని గ్రహించి వైసిపిలో చేరినట్లు తెలిపారు. వైసిపిలో చేరిన వారికి తగిన గుర్తింపునిస్తామని, వైసిపి అభివృద్ధికి కృషి చేయాలని సూచించారు. గ్రామ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

భీమా ఇవ్వని బీమా..!

- పత్తి రైతు విలవిల...
- అధికారుల తప్పిదాలు.. రైతులకు శాపం

ప్రజాశక్తి - కౌతాళం

జిల్లాలోని పశ్చిమ ప్రాంతంలో నల్లరేగడి భూములు కలిగిన మండలం కౌతాళం. రైతులు ప్రధానంగా పత్తి పంటలను అధికంగా సాగు చేస్తున్నారు. ప్రకృతి వైపరీత్యాల వల్ల పంట నష్టం జరిగితే, దిగుబడులు తగ్గినా పంట బీమా ద్వారా ఆదుకోవడానికి రాష్ట్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ప్రతి ఎకరాకు పంట బీమా ద్వారా వచ్చిన సొమ్ము నేరుగా రైతుల ఖాతాలో జమ చేసేలా ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి చర్యలు తీసుకున్నారు. అధికారుల తప్పిదాలు రైతులకు శాపంగా మారాయి.


అధిక వర్షాలతో నీట మునిగిన పత్తి పంట (ఫైల్)

వ్యవసాయ అధికారుల నివేదికల ప్రకారం కౌతాళం మండలంలో 47,422 ఎకరాల్లో రైతులు పత్తి పంటను సాగు చేశారు. ఇన్ని వేల ఎకరాల్లో పంట సాగయితే కేవలం 958 ఎకరాలకు మాత్రమే పంట బీమా మంజూరయింది. ప్రకృతి వైపరీత్యాల వల్ల నష్టపోయిన కేవలం 293 ఎకరాలకు గాను 199 మంది రైతులకు రూ.2.90 లక్షలు మంజూరయింది. దిగుబడి రాక కేవలం 958 ఎకరాలకు 1,457 మంది రైతులకు రూ.1.32 కోట్లు మంజూరయింది. చాలామంది రైతులకు పంట బీమా రాకపోవడంతో విలవిల్లాడుతున్నారు. రైతు భరోసా కేంద్రాల వద్ద పంట బీమా జాబితాలో పేర్లు రాకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. కొన్ని గ్రామాల్లో కేవలం ఒకరిద్దరికే పంట బీమా మంజూరు కావడంతో గ్రామ రైతులు ఆశ్చర్యానికి గురవుతున్నారు. ఎకరాకు రూ.40 వేల నుంచి రూ.60 వేల వరకు పెట్టుబడులు పెట్టి రైతులు సాగు చేశారు. అతివృష్టి, అనావృష్టి వల్ల, నాసిరకం విత్తనాల వల్ల దిగుబడులు రాక రైతులు పూర్తిగా నష్టపోయారు. ఎకరాకు కేవలం 1, 2 క్వింటాళ్లు మాత్రమే దిగుబడి రావడంతో రైతులు అప్పుల పాలయ్యారు. ఇలా నష్టపోయిన రైతులు ప్రభుత్వం పంట బీమా మంజూరు చేస్తుందని ఎన్నో ఆశలతో ఎదురు చూశారు. వ్యవసాయ అధికారులు విడుదల చేసిన పంట బీమా జాబితాను చూసి రైతులు నిరాశకు గురయ్యారు. పంట బీమా మంజూరు కావడంలో తప్పిదాలు ఎక్కడ జరిగాయో విచారణ చేసి రైతులకు న్యాయం జరిగేలా ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలి. రైతులందరికీ పంట బీమా అందేలా చూడాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

పత్తి రైతులను ఆదుకోవాలి

- మల్లయ్య, రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు



మండలంలో పంట బీమా అందని పత్తి రైతులను వెంటనే ఆదుకోవాలి. వేలమంది రైతులు పత్తి పంట సాగు చేస్తే కేవలం కొద్దిమందికే పంట బీమా వచ్చింది. పంట బీమా రాకపోవడంలో అధికారుల నిర్లక్ష్యం స్పష్టంగా కనబడుతోంది. రైతులందరికీ న్యాయం జరగకపోతే రైతుల ఆధ్వర్యంలో ఆందోళనలు చేపడతాం.

మెరుగైన విద్యకు మారు పేరు... జిఎస్ఆర్ హైస్కూల్...

- నేషనల్ విద్యాసంస్థల అధినేత గోపాల్ రెడ్డి

ప్రజాశక్తి - ఆదోని



మెరుగైన విద్యకు మారు పేరుగా జిఎస్ఆర్ హైస్కూల్‌ను నిలిపేందుకు అహర్నిశలు కృషి చేస్తున్నామని నేషనల్ విద్యాసంస్థల అధినేత, జిఎస్ఆర్ హైస్కూల్ కరస్పాండెంట్ జి.గోపాల్ రెడ్డి తెలిపారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. పట్టణంలో నేషనల్ విద్యాసంస్థలు నెలకొల్పి పేద విద్యార్థులకు తక్కువ ఫీజుతో నాణ్యమైన విద్యనందిస్తూ, అందరి ఆదరాభిమానాలు పొందామని తెలిపారు. స్కూల్‌తో ప్రారంభమై అనతి కాలంలోనే లాభాపేక్షను ఆలోచించకుండా జూనియర్ కళాశాల నెలకొల్పినట్లు చెప్పారు. విద్యారంగంలో తమకంటూ గుర్తింపు ఉందన్నారు. ఈ ప్రాంత చిన్నారులకు మెరుగైన విద్యనందించేందుకు జిఎస్ఆర్ డే అండ్ రెసిడెన్షియల్ హైస్కూల్‌ను కొత్తగా నెలకొల్పామని తెలిపారు. రెసిడెన్షియల్ స్కూళ్ల కోసం దూర ప్రాంతాలకు వెళ్లేందుకు ఇబ్బందిగా ఉందని తల్లిదండ్రుల కోరిక మేరకు ఆదోనిలోనే రెసిడెన్షియల్ హైస్కూల్ ఏర్పాటు చేసి విద్యార్థుల అభివృద్ధి మేరకు విద్యను అందిస్తున్నామన్నారు. విశాలమైన మైదానం, ఆధునిక సదుపాయాలతో శిల్పా సౌభాగ్య నగర్‌లో ఈ ఏడాది నుంచే జిఎస్ఆర్ డే అండ్ రెసిడెన్షియల్ హైస్కూల్‌ను ప్రారంభించినట్లు తెలిపారు. అనుభవజ్ఞులు, అంకితభావం కలిగిన ఉపాధ్యాయులతో విద్యాబోధన చేపడుతున్నట్లు చెప్పారు. విద్యార్థుల ఆలోచనలను, సృజనాత్మకతను గమనించి దానికి అనుగుణంగానే విద్యా ప్రమాణాలను పెంపొందించి వారిని భావిభారత పౌరులుగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా పెట్టుకున్నామని తెలిపారు. ప్రతి సబ్జెక్టులోనూ విద్యార్థి నైపుణ్యతను పెంపొందించేందుకు పూర్తి వసతులతో కూడిన ఆడియో, విజువల్, ల్యాబ్, కంప్యూటర్ ల్యాబ్, ఎల్‌సిడి ప్రొజెక్టర్ ద్వారా శిక్షణ ఇస్తున్నామని వివరించారు. బాలబాలికలకు వేర్వేరుగా అన్ని రకాల సౌకర్యాలతో రుచికరమైన భోజనంతో హాస్టల్ వసతి ఉందన్నారు. విద్యార్థుల శారీరక దృఢత్వానికి ఆటలు, కరాటే శిక్షణ ఇప్పిస్తున్నామని తెలిపారు. దూర ప్రాంత, గ్రామీణ విద్యార్థులకు బస్సు సౌకర్యం ఉందన్నారు. నర్సరీ నుంచి 10వ తరగతి వరకు అడ్మిషన్లు ప్రారంభమయ్యాయని తెలిపారు. ఉజ్వల భవిష్యత్తు కోసం పిల్లలను తమ పాఠశాలలో చేర్పించాలని తల్లిదండ్రులను కోరారు.

అరకొరగా బీమా పరిహారం

- పత్తి రైతులకు అందని బీమా...

- ఆందోళనలో రైతులు

ప్రజాశక్తి- దేవనకొండ

గత ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసిన ఉచిత పంటల బీమా పరిహారం అరకొరగా ఉంది. దేవనకొండ మండలానికి సంబంధించి పత్తి రైతులకు బీమా పరిహారం మంజూరు కాకపోవడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గత ఖరీఫ్ సీజన్‌లో ప్రకృతి వైపరీత్యాలు, వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో పంటలు దెబ్బతిని రైతులు తీవ్రంగా నష్టపోయారు. ఈ రైతులకు ప్రభుత్వం చెల్లించిన పంటల బీమాకు ఇన్స్యూరెన్స్ కంపెనీలు పరిహారం అందిస్తాయి. ఈ నేపథ్యంలో మండలానికి రూ.7 కోట్లు వాతావరణ బీమా కింద పరిహారం మంజూరు చేశారు. కేవలం 9,898 మంది వేరుశనగ రైతులకు రూ.2.34 కోట్లు, 3,131 మంది ఉల్లి రైతులకు రూ.4.71 కోట్ల నిధులను మంజూరు చేశారు. వేరుశనగ రైతులకు ఎకరాకు రూ.700 ప్రకారం, ఉల్లి పంటకు రూ.10 వేల ప్రకారం రైతులకు పరిహారం జాబితా ప్రచురించారు. పంటల పెట్టుబడుల కోసం రైతులు వేరుశనగకు ఎకరాకు రూ.30 వేలు, ఉల్లి పంటకు రూ.లక్ష దాకా పెట్టుబడులు పెడితే అరకొరగా బీమా పరిహారం మంజూరు చేసినట్లు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గతేడాది పత్తి, ఆముదం వంటి పంటలు వేల ఎకరాల్లో రైతులు సాగు చేశారని, అసలుకే వాటికి పరిహారం మంజూరు చేయకపోవడం దారుణమని మండల రైతులు గగ్గోలు పెడుతున్నారు. పాలకులు, రెవెన్యూ, వ్యవసాయ అధికారులు పంటల నష్టం అంచనా వేయడంలో తీవ్ర నిర్లక్ష్యం వహించారని రైతులు వాపోతున్నారు. ఇప్పటికైనా పాలక ప్రభుత్వాలు మండలంలో నష్టపోయిన రైతులందరికీ అన్ని పంటలకు పరిహారం అందేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

కొండెక్కిన కూరగాయలు

- నాలుగింతలు పెరిగిన సామాన్యుని వంటింటి బడ్జెట్
- సెంచరీ దాటిన పచ్చిమిర్చి, టమోటా

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

ప్రస్తుతం కూరగాయల ధరలు కొండెక్కి కూర్చున్నాయి. ఈ ధరలతో సామాన్యుని వంటింటి బడ్జెట్ నాలుగింతలు పెరిగింది. టమోటా, పచ్చిమిర్చి ధరలు రూ.100 దాటాయి. ధరల స్థిరీకరణ చట్టం తీసుకొచ్చి రైతులకు, వినియోగదారులకు అందుబాటులోకి తీసుకొస్తామని అటు బిజెపి, కాంగ్రెస్, టిడిపి, వైసిపి నాయకులు ఎన్నికల ముందు ఊకదంపుడు ఉపన్యాసాలు చేశారు. పాదయాత్రల్లో విచ్చలవిడి వాగ్దానాలు చేస్తూ అధికారంలో వచ్చిన తర్వాత తమకేమీ పట్టనట్టు ముందుకు పోతున్నారని విమర్శలు వస్తున్నాయి. మామూలుగా ప్రతేడాది వేసవిలో కూరగాయల ధరలు పెరగడం పరిపాటి. ఈఏడాది ధరలు నాలుగింతలు పెరగడంతో సామాన్యుని వంటింటి బడ్జెట్ నాలుగింతలు పెరిగింది. కూరగాయల సాగుపై రైతులకు అవగాహన లేకపోవడం, వ్యవసాయ శాఖ అధికారులు అవగాహన కల్పించాల్సిన ఆవశ్యకత ఉంది. అలాగే రైతులకు వేసవిలో కూరగాయల సాగుకు విత్తన, ఎరువుల రాయితీ ఇవ్వాల్సిన అవసరం ఉంది. ఈ ప్రాంతంలో కూరగాయల సాగు లేకపోవడంతో ఇతర ప్రాంతాల నుంచి దిగుమతి చేసుకోవడంతో ధరలు పెరగడం ఒక కారణం. ఈ దుస్థితి



ఆగస్టు చివరి వరకు ఉండవచ్చని పలువురు అంచనా వేస్తున్నారు. ఎమ్మిగనూరు పట్టణంలోని నందమూరి తారక రామారావు కూరగాయల మార్కెట్‌లో పచ్చిమిర్చి రూ.130, టమోటా రూ.120 పలికింది. అలాగే క్యాలీఫ్లవర్ రూ.80, బీరకాయ రూ.70, బెండకాయ రూ.60, కాకరకాయ రూ.70, సోరకాయ రూ.60, చోళకాయ రూ.60, బీన్స్ రూ.80, చిక్కుడు రూ.80, దొండకాయ రూ.70, ఆలుగడ్డ రూ.50, ముల్లంగి రూ.60, వంకాయ రూ.60, దోసకాయ రూ.60 పలికింది. అలాగే కొత్తిమీర చిన్న కట్ట రూ.20, పాలకూర రూ.10, మెంతికూర రూ.20, గోంగూర రూ.15 కూరగాయలకు పోటీగా ఆకుకూరలు కూడా పెరిగాయి. ధరలు ఇలా పెరగడంతో సమతుల్య ఆహారానికి దూరమయ్యే పరిస్థితి నెలకొంది. ఇప్పటికైనా ప్రభుత్వం చొరవ తీసుకొని సబ్సిడీపై కూరగాయలు అందించాలని ప్రజలు కోరుతున్నారు.

అప్పుల బాధతో రైతు ఆత్మహత్య

ప్రజాశక్తి-ఆలూరు



మండలంలోని మొలగవల్లి గ్రామంలో అప్పులబాధతో రైతు మాల నౌనేపాటి (40) ఆదివారం ఆత్మహత్య చేసుకున్నారు. బంధువుల వివరాల మేరకు... మాల హుసేనప్ప కుమారుడు మాల నౌనేపాటి ఉన్న రెండెకరాల పొలంతో పాటు మూడేళ్లుగా 5 ఎకరాల పొలం కౌలుకు తీసుకొని ఉల్లి పంట సాగు చేస్తున్నారు. అరకొర దిగుబడికి తోడు ధరలు ఆశించినంత రాకపోవడంతో అప్పులు అధికమయ్యాయి. అప్పులు తీర్చలేక మనస్తాపం చెంది ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఇనుప రాడ్‌కు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నారు. కుటుంబ సభ్యులు గుర్తించి ఆలూరు ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపినట్లు తెలిసింది. మృతునికి భార్య మల్లీశ్వరి, ముగ్గురు కుమారులు ఉన్నారు. మృతుని కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్తులు కోరారు.

విద్యుదాఘాతంతో కాలిపోయిన మోటార్

ప్రజాశక్తి - పెద్దకడబూరు

మండలంలోని కల్లుకుంట గ్రామ శివారులో ఎంపియుపి స్కూల్ దగ్గర ఆదివారం విద్యుదాఘాతం సంభవించింది. విద్యుత్ స్తంభానికి కట్టిన బోర్డు వద్ద పెద్ద మంటలు వచ్చి మోటార్ కాలిపోయింది. ఆ సమయంలో చుట్టుపక్కల ఎవరూ లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. గ్రామంలో ఏర్పాటు చేసిన మినీ ట్యాంకులకు ఇక్కడి బోరు నుంచి నీరు సరఫరా అవుతోందని, విద్యుదాఘాతంతో మోటార్ కూడా కాలిపోయి ఉంటుందని గ్రామస్తులు వాపోయారు.

కుమార్తె పుట్టిన రోజు సందర్భంగా గ్రంథాలయానికి పుస్తకాలు విరాళం


పుస్తకాలను అందజేస్తున్న భీమన్న

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు రూరల్

గ్రంథాలయ పాఠకుడు భీమన్న కుమార్తె అక్షయ పుట్టినరోజు సందర్భంగా గ్రంథాలయానికి నూతనంగా ప్రచురితమైన రూ.5 వేల విలువ చేసే వివిధ సబ్జెక్టుల పుస్తకాలను ఆదివారం విరాళంగా అందజేశారు. ఈ సందర్భంగా గ్రంథాలయ ఇన్‌ఛార్జీ హరికృష్ణ మాట్లాడారు. ప్రస్తుతం ఉన్న పోటీ ప్రపంచంలో పేద విద్యార్థులు ఖరీదైన పుస్తకాలు కొనుగోలు చేయడం కష్టంగా ఉందని తెలిపారు. విరాళంగా ఇచ్చిన ఈ పుస్తకాలు అనేక ప్రభుత్వ ఉద్యోగాలకు సన్నద్ధమవుతున్న యువతకు ఉపయోగపడతాయని చెప్పారు.

బిటి.నాయుడు ఎన్నిక పట్ల హర్షం

ప్రజాశక్తి - హోళగుంద



టిడిపి జిల్లా అధ్య క్షులుగా బిటి.నాయుడును ఎన్నుకోవడం పట్ల టిడిపి మండల కన్వీనర్ డాక్టర్ తిప్పయ్య హర్షం వ్యక్తం చేశారు. ఆదివారం ఆయన మాట్లాడారు. టిడిపి జిల్లా అధ్యక్షులుగా బి టి . నా య ు డ ు ను ఎన్నుకోవడం కార్యకర్తలనే కాదు, 7 లక్షల వాల్మీకులను గౌరవించడమని తెలిపారు. టిడిపి జాతీయ అధ్యక్షులు చంద్రబాబు నాయుడుకు, రాష్ట్ర అధ్యక్షులు అచ్చెన్నాయుడుకు కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్రంలో, జిల్లాలో టిడిపి జెండాను ఎగురవేస్తామన్నారు. వాల్మీకులకు ఎస్సీ జాబితాలో చేర్చాలని కోరారు.


హోమం నిర్వహిస్తున్న నాయకులు

దేవరగట్టులో వరుణ హోమం

ప్రజాశక్తి - హోళగుంద

మండలంలోని నెరణికి, కొత్తపేట తండా కొండ గుహలో వెలసిన దేవరగట్టు శ్రీమాలమల్లేశ్వర స్వామి సన్నిధిలో సాగునీటి సంఘం అధ్యక్షులు సమ్మతగేరి తప్పిటి రామారెడ్డి మూడు రోజులుగా వర్షం కోసం వరుణ హోమం నిర్వహించారు. ఆదివారం ముగింపు సందర్భంగా చుట్టుపక్కల గ్రామాల రైతులు అధిక సంఖ్యలో హాజరయ్యారు. ఈ ఏడాది వర్షాలు బాగా కురిసి తమ జీవితాలు బాగుండాలని హోమం చేశారు. వరుణుని అనుగ్రహంతో పాటు శ్రీమాలమల్లేశ్వర స్వామి ఆశీస్సులు కూడా తమపై ఉండాలని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

దేవరగట్టులో భక్తుల రద్దీ

దేవరగట్టులో ఆదివారం సందర్భంగా భక్తుల రద్దీ పెరిగింది. ఉదయం 6 గంటల నుంచి భక్తుల విరివిగా శ్రీమాల మల్లేశ్వరునికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలూరు నియోజకవర్గం భక్తులే కాకుండా కర్ణాటక రాష్ట్రం నుంచి అధిక సంఖ్యలో భక్తులు హాజరయ్యారు. దేవరగట్టు అన్నదాన సత్రంలో భక్తులకు ఉచిత అన్నదానం ఏర్పాటు చేశారు. దేవరగట్టులో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలూ చోటు చేసుకోకుండా ఎస్ఐ శ్రీనివాసులు ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.

మాజీ ఎమ్మెల్యే బీవీకి పుత్రిక జననం

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ బీవీ.జయనాగేశ్వర రెడ్డి దంపతులకు పుత్రిక (ఆడబిడ్డ) ఆదివారం జన్మించింది. బీవీకి ఆడబిడ్డ పుట్టినందుకు సంతోషిస్తూ పట్టణంలోని సోమప్ప సర్కిల్‌లో టిడిపి నాయకులు, కార్యక్తలు బాణసంచా పేల్చి మిఠాయిలు పంచుకొని సంబరాలు జరుపుకున్నారు.



చిప్పగిరి నుంచి మద్దికెరకు వెళ్లే

రోడ్డు పనులు మొదలయ్యేనా..?

ప్రజాశక్తి - చిప్పగిరి

ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి పాలన మొదలయ్యాక చిప్పగిరి మండలంలో కొన్ని రహదారులకు మోక్షం లభించింది. మరికొన్ని రహదారులు మాత్రం ఇప్పటికీ పూర్తి కాలేదు. అవి కూడా పూర్తయితే బాగుంటుందని ప్రజలు ఎదురుచూస్తున్నారు.

చిప్పగిరి మండలంలో రహదారుల అభివృద్ధి కోసం రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి గుమ్మనూరు జయరామ్ అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నారు. ఈ నేపథ్యంలో చిప్పగిరి నుంచి బంటనహాల్ మీదుగా బంటనహాల్ రైల్వే స్టేషన్ వరకు రూ.4 కోట్లతో రోడ్డు పనులు పూర్తయ్యాయి. మంత్రి జయరామ్ స్వగ్రామమైన గుమ్మనూరుకు వెళ్లేందుకు రహదారి సరిగా లేక కంకర తేలి గుంతలుగా ఉండేదని, గత పాలనలో ద్విచక్ర వాహనాలు వెళ్లేందుకు కూడా ప్రజలు చాలా ఇబ్బంది పడే వారని ఆ గ్రామస్తులు పేర్కొంటున్నారు. మంత్రి స్వగ్రామం గుమ్మనూరుకు కూడా రోడ్డు వేయించుకోలేరా అని ప్రజలంతా చర్చించుకున్నారు. మంత్రి ప్రతిపక్షంలో ఏమీ చేయలేకపోయారు. మంత్రి తప్పనిసరిగా రోడ్డు వేయాలని సంబంధిత అధికారులతో మాట్లాడి పెంచలపాడు నుంచి గుమ్మనూరు వరకు ప్రధానమంత్రి సడక్ యోజన కింద రూ.5 కోట్ల నిధులతో రోడ్డు పనులను వేగవంతంగా పూర్తి చేయించారు. ఈ రోడ్డు పనులు పూర్తి కావడంతో మండలంలోని ప్రతి గ్రామానికీ చెందిన ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. చిప్పగిరి నుంచి మద్దికెర వరకు చేపట్టబోయే రోడ్డు పనులకు రూ.10 కోట్ల నిధులతో టెండర్ కూడా పూర్తయిందని ఈ మధ్యనే అధికారులు, ప్రజాప్రతినిధులు తెలిపారు. రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి గుమ్మనూరు జయరామ్ ఈ రోడ్డు పనులు చేపట్టేలా చొరవ చూపాలని ప్రజలు కోరుతున్నారు. డివిజన్ ప్రాంతమైన పత్తికొండకు వెళ్లేందుకు అనువైన రహదారి ఇది ఒక్కటేనని, ఈ రోడ్డు పూర్తయితే చిప్పగిరి మండల ప్రజలే కాక హాలహర్వి మండల ప్రజలు కూడా సంతోషిస్తారని, ఈ ప్రాధాన్యత రోడ్డు పూర్తయ్యేలా మంత్రి జయరామ్, కలెక్టర్ సహకారం అందించాలని ప్రజలు కోరుతున్నారు. గత ప్రభుత్వంలో రూ.8 కోట్లతో చేపట్టి నిలిచిపోయిన నేమకల్లు నుంచి మొలగవల్లి రోడ్డు పనులు కూడా పూర్తి చేయాలని ప్రజలు కోరుతున్నారు.


పనులు పూర్తయిన పెంచలపాడు, గుమ్మనూరు రోడ్డు


మొదలుకాని చిప్పగిరి నుంచి మద్దికెర రోడ్డు



మాట్లాడుతున్న సిపిఐ జిల్లా కార్యదర్శి గిడ్డయ్య

ఆర్‌డిఎస్ కుడి కాలువ ప్రాజెక్టుకు నిధులు కేటాయించి

పనులు వేగవంతం చేయాలి

- సిపిఐ జిల్లా కార్యదర్శి గిడ్డయ్య

ప్రజాశక్తి - కోసిగి రూరల్

ఆర్‌డిఎస్ కుడి కాలువ ప్రాజెక్టుకు నిధులు కేటాయించి పనులను వేగవంతం చేయాలని సిపిఐ జిల్లా కార్యదర్శి గిడ్డయ్య కోరారు. ఆదివారం కోసిగిలో గోపాల్ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ముఖ్యఅతిథులుగా గిడ్డయ్య, సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి మునెప్ప, జిల్లా కార్యవర్గ సభ్యుడు భాస్కర్ యాదవ్ పాల్గొని మాట్లాడారు. ఆర్‌డిఎస్ కుడి కాలువ ప్రాజెక్ట్ పనులపై అధికారులు జాప్యం చేస్తున్నారని మండిపడ్డారు. పులికెనుమ ప్రాజెక్టు నుంచి ఎత్తిపోతల పథకాల ద్వారా ప్రజలకు, ప్రతి రైతుకు సాగునీరు అందించాలని డిమాండ్ చేశారు. లేకపోతే సిపిఐ ఆధ్వర్యంలో రైతులను కలుపుకొని పోరాటం చేస్తామని హెచ్చరించారు. అనంతరం గిడ్డయ్య, మునెప్ప ఆధ్వర్యంలో 21 మంది సభ్యులతో సిపిఐ మండల సమితిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సిపిఐ మండల కార్యదర్శిగా ఎం.గోపాల్, సహాయ కార్యదర్శిగా ఓంకార స్వామి, మండల నాయకులుగా ఎం.రాజు, ఎ.జీవన్, ఎస్.ఈరేష్, రాజేంద్ర, అబ్రహం, సిద్ధప్ప, లక్ష్మన్నను ఎన్నుకున్నారు.

ఫ్యాషన్ డిజైన్ శిక్షణతో.. మహిళల జీవితాలకు భరోసా

- సర్పంచి తెల్లబండ్ల భీమయ్య

ప్రజాశక్తి - మంత్రాలయం


ఫ్యాషన్ డిజైన్‌లో శిక్షణ పూర్తి చేసుకున్న మహిళలకు స్వతంత్ర జీవితంపై భరోసా కలుగుతుందని సర్పంచి తెల్లబండ్ల భీమయ్య తెలిపారు. ఆదివారం కర్ణాటక రాష్ట్రంలోని ఉడిపి జిల్లా కర్కల ప్రాంతంలోని శ్రీనివాస్ సేవా ట్రస్టు (ఆర్) ఆధ్వర్యంలో సుమేధ ఫ్యాషన్ ఇనిస్టిట్యూట్ నిర్వాహకులు సాధన జి.ఆశ్రిత్ నేతృత్వంలో స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలోని పాత పాఠశాల గదిలో నాలుగు రోజుల పాటు జరిగే శిక్షణ తరగతులను జ్యోతి ప్రజ్వలన చేసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఫ్యాషన్ డిజైన్ నేర్చుకోవడం వల్ల విద్యార్థులు, మహిళలు ఇతరులపై ఆధారపడకుండా స్వతంత్రంగా జీవిస్తారని తెలిపారు. కుటుంబాలకు ఆసరాగా ఉంటూ పిల్లల భవిష్యత్తును తీర్చిదిద్దుకునేందుకు అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. సాదన జి.ఆశ్రిత్ మంత్రాలయం మహిళలకు ఇలాంటి అవకాశం కల్పించడం అభినందనీయమన్నారు. అభివృద్ధి చెందుతున్న పుణ్యక్షేత్రమైన మంత్రాల యంలో శిక్షణ పొందిన మహిళలకు ఆదాయ ఆర్జన సులభతరం అవుతుందని తెలిపారు. ఇప్పటికే మహిళలు చిరు వ్యాపారాలు చేసుకుంటున్నారని చెప్పారు. ఇలాంటి నైపుణ్యం వల్ల ఆదాయం మరింత పెరిగే అవకాశం ఉందన్నారు. నిఘా పత్రిక జిల్లా స్టాఫర్ వడ్డే విజయ్ కుమార్ సహకారం వల్ల ఇక్కడ శిక్షణ కార్యక్రమం జరగడం అభినందనీయమన్నారు. ఈ విషయం గ్రామంలో ఇంకా చాలామంది విద్యార్థులకు, మహిళలకు తెలియదని తెలిపారు. సోషల్ మీడియా ద్వారా, దండోరాతో ప్రచారం నిర్వహిస్తామని, దీని వల్ల మరింత మంది విద్యార్థులకు, మహిళలకు అవకాశం ఏర్పడుతుందని చెప్పారు. మహిళల అభివృద్ధికి దోహదపడే కార్యక్రమాలే కాక సమాజానికి ఉపయోగపడే ఎలాంటి పనికైనా రాంపురం రెడ్డి సోదరుల ఆదేశాలతో సంపూర్ణ సహకారం అందిస్తామని తెలిపారు.

ఫ్యాషన్ డిజైన్‌లో ఉచిత శిక్షణను ఉపయోగించుకోండి

- నిర్వాహకురాలు సాధన జి. ఆశ్రిత్

ఫ్యాషన్ డిజైన్‌లో ఉన్న విభాగాల ఉచిత శిక్షణ తరగతులను యువత ఉపయోగించుకోవాలని నిర్వాహకులు సాధన జి.ఆశ్రిత్ కోరారు. స్థానిక పూర్వపు విద్యార్థి చందన, విలేకరి విజయకుమార్, ఆయన కుమార్తె పూజిత ఆహ్వానం మేరకు ఇక్కడ తరగతులు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ నెల 2 నుంచి 5 వరకు జరిగే ఈ శిక్షణలో చేతి ఎంబ్రాయిడరీ, చేతి కుచ్చు, క్లే జ్యూవెలరీ, బ్రైడల్ మేకప్, ఫ్యాషన్ ఇలస్ట్రేషన్ డిజైన్ల తరగతులు ఉంటాయని చెప్పారు. 16-45 ఏళ్ల వయస్సు గలవారు ఈ శిక్షణలో పాల్గొనేందుకు అవకాశం ఉందని తెలిపారు. పది, ఆపైన ఉత్తీర్ణత సాధించిన వారు అర్హులన్నారు. ఉదయం 10 నుంచి సాయంత్రం 4 గంటల వరకు శిక్షణ ఉంటుందని చెప్పారు. ఈ శిక్షణలో అనేక అంశాలపై అవగాహన కల్పించి, ఎందులో వారికి ఉత్సాహం ఉంటుందో తెలుసుకొని అందులో వారికి సూచనలు చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమాన్ని సర్పంచి భీమయ్య చేతుల మీదుగా ప్రారంభించడం సంతోషంగా ఉందని, ఆయనకు ధన్యవాదాలు తెలిపారు. సుమారు 60 మంది విద్యార్థులు, మహిళలు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న సర్పంచి తెల్లబండ్ల భీమయ్య



ఆర్‌బికెలలో సబ్సిడీ విత్తనాలు నిల్

- విత్తనాల కోసం రైతులు ఎదురు చూపు
- కార్యాచరణలో మాత్రం వున్నట్లు చూపుతున్న అధికారులు

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

'రాజన్న రాజ్యం.. రైతన్న ప్రభుత్వం.. రైతు సంక్షేమమే మా లక్ష్యం.. ఖరీఫ్ సీజన్ ప్రారంభం నాటికి అన్ని రకాల సబ్సిడీ విత్తనాలు అందించి నకిలీకి చెక్ పెడతూ రైతు భరోసా కేంద్రాల ద్వారా విత్తనాలు పంపిణీ చేయాలన్నది ప్రభుత్వ లక్ష్యం..' ఈ మాటలు అధికార పార్టీ ప్రజాప్రతినిధులు, జిల్లా అధికార యంత్రాంగం రైతులకు పలు మీటింగల్లో చెప్పే మాటలు. ఖరీఫ్ ప్రారంభానికి రైతులకు సబ్సిడీ విత్తనాలు అందించాల్సి ఉంది. కానీ జిల్లాలోని చాలా రైతు భరోసా కేంద్రాల్లో జీలుగ, పత్తి, మిరప, మొక్కజొన్న, వరి, కంది వంటి సబ్సిడీ విత్తనాలు అందుబాటులో లేవు...

జిల్లాలోని రుద్రవరం, సిరివెళ్ల, ఆళ్లగడ్డ, చాగలమర్రి మండలాల్లో రైతులు కర్నూలు సోనా, నంద్యాల సోనా వరి విత్తనాల కోసం రైతులు ఎదురు చూస్తున్నారు. అలాగే మిడ్తూరు మండలంలో ఒక గ్రామంలో కేవలం కొంతమంది రైతులకు కంది విత్తనాలు సబ్సిడీపై పంపిణీ చేశారు. పగిడ్యాల, పాణ్యం, గడివేముల తదితర మండలాల్లో ఇంకా నేటికీ రైతు భరోసా కేంద్రాల్లో సబ్సిడీ విత్తనాలు అందుబాటులో లేనట్లు విమర్శలు వస్తున్నాయి. జిల్లాలోని ఆర్‌బికె కేంద్రాలలో విత్తనాల కొరత తీవ్రంగా ఉంది. రైతులకు అవసరమైన సబ్సిడీ విత్తనాలను పంపిణీ చేస్తున్నామని సాక్షాత్తు జిల్లా కలెక్టర్, వ్యవసాయ అధికారులు చెబుతున్నా ఆచరణలో మాత్రం ఆర్‌బికెలలో విత్తనాలు లేవు. జిల్లాలో రైతన్నకు అవసరమైన పత్తి, మిరప, మొక్కజొన్న, వరి వంటి విత్తనాల జాడే లేదు. ఏ ఆర్‌బికెలో వెతికినా జీలుగ విత్తనాలు తప్ప మిగిలినవి కనిపించడం లేదు. దీంతో రైతులు బహిరంగ మార్కెట్‌లో ప్రయివేట్ సీడ్స్ కంపెనీలలో, అంగళ్లలో కొనుగోలు చేస్తూ నకిలీ బారిన పడుతున్నారు. గత సంవత్సరం పత్తి, మిరప, మొక్కజొన్న, వరి వంటి బయటి కొన్న విత్తనాలు నకిలీ కావడంతో పాణ్యం, చాగలమర్రి, మిడ్తూరు, గడివేముల, గని, నందికొట్కూరు ప్రాంతాల్లో రైతులు తీవ్రంగా నష్టపోయారు. వారికి ప్రభుత్వం ప్రకటించిన నష్టపరిహారం ఇంత వరకు అందలేదు. ప్రస్తుతం ఆర్‌బికెలలో ఉన్న విత్తనాలకు, అధికారులు చెప్పేదానికి పొంతన ఉండటం లేదు. ఖరీఫ్ ప్రారంభమై మాసం దాటినా వర్షాలు లేక విలవిలలాడుతున్న రైతులకు మరోవైపు జిల్లా అధికార యంత్రాంగం సబ్సిడీ విత్తనాలు అందించలేని పరిస్థితి నెలకొంది. ఇప్పటికైనా జిల్లా అధికారులు స్పందించి నకిలీ విత్తనాలకు అవకాశం లేకుండా ఆర్‌బికెల ద్వారా అన్ని రకాల విత్తనాలు సబ్సిడీపై పంపిణీ చేయాలని రైతులు కోరుతున్నారు.



ఆర్‌బికెల ద్వారా సబ్సిడీ విత్తనాలు పంపిణీ చేయాలి



ఆర్‌బికెల ద్వారా రైతులకు కావాల్సిన విత్తనాలు, ఎరువులు సబ్సిడీపై పంపిణీ చేయాలి. అత్యధికంగా సాగు చేసే పత్తి, కంది, మొక్కజొన్న, మిరప, వరి విత్తనాలు నేటికీ అందుబాటులో లేకపోవడం శోచనీయం. ప్రభుత్వం సబ్సిడీ విత్తనాలను సరఫరా చేయకుండా బయటి మార్కెట్‌ను ప్రోత్సహిస్తుంది. గతంలో ఇలా చేయడం వలన నకిలీ విత్తనాలతో రైతులు తీవ్రంగా నష్టపోయారు. నేటికీ ప్రభుత్వం నష్టపరిహారం చెల్లించలేదు.

- టి.రమేష్ కుమార్, సిపిఎం జిల్లా కార్యదర్శి.


అన్ని రకాల విత్తనాలు అందుబాటులో ఉంచాలి



జిల్లాలో రైతాంగానికి అవసరమైన అన్ని రకాల విత్తనాలు అందుబాటులో ఉన్నాయని వ్యవసాయ అధికారులు చెబుతున్నారు. కానీ ఆళ్లగడ్డ నియోజకవర్గంలో విరుద్ధంగా పరిస్థితి ఉంది. కేవలం కొంతమందికి మాత్రమే జీలుగ విత్తనాలు ఇచ్చారు. వెంటనే ఆర్‌బికెల ద్వారా విత్తనాలు సరఫరా చేయాలి.

- టి.రామచంద్రుడు, ఎపి రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి.

కంది విత్తనాలు మాత్రమే ఇచ్చారు



మల్యాల గ్రామం రైతు భరోసా కేంద్రంలో కేవలం కంది విత్తనాలు మాత్రమే ఇస్తున్నారు. మాకు అవసరమైన మొక్కజొన్న, పత్తి విత్తనాలు ఇవ్వడం లేదు. వ్యవసాయ అధికారులు మొక్కజొన్న, పతి విత్తనాలు సరఫరా చేయాలి.

- మండ్ల దామోదర్ నాయుడు, మల్యాల గ్రామం, నందికొట్కూరు మండలం.

నాణ్యమైన విద్యుత్ అందించడమే లక్ష్యం

- గత ఏడాది పూర్తి స్థాయిలో వ్యవసాయ కనెక్షన్లు
- ప్రజాశక్తితో విద్యుత్ ఎస్ఇ ఉమాపతి ముఖాముఖి

ప్రజాశక్తి - కర్నూలు కార్పొరేషన్

అంతరాయంలేని నాణ్యమైన విద్యుత్తు అందించడమే ప్రధాన లక్ష్యమని ఎపి ఎస్‌పిడిసిఎల్ ఉమ్మడి కర్నూలు జిల్లా ఎస్ఇ ఎం.ఉమాపతి తెలిపారు. విద్యుత్తు మానవుని జీవితంలో ఒక ముఖ్య భాగమైంది అది లేనిదే ఏ పని ముందుకు సాగడం లేదన్నారు. ప్రజాశక్తితో ముఖాముఖి ద్వారా ఆయన మాట్లాడారు..



ఉభయ జిల్లాల్లో ఏయే రకమైన విద్యుత్తు వినియోగదారులు ఎంతమంది ఉన్నారు?

ఎస్ఇ : గృహ విద్యుత్ వినియోగానికి సంబంధించి కర్నూల్ జిల్లాలో 6,70,000, నంద్యాలలో ఐదు లక్షల విద్యుత్ వినియోగదారులు ఉన్నారు. కర్నూలు జిల్లాలో 86,000, నంద్యాలలో 59,000 వ్యాపార విద్యుత్ కనెక్షన్లు ఉన్నాయి. కర్నూలు జిల్లాలో 3500, నంద్యాల జిల్లాలో 6,305 పారిశ్రామిక కనెక్షన్లు ఉన్నాయి. కర్నూలు జిల్లాలో వ్యవసాయ కనెక్షన్లు 1,08,000, నంద్యాలలో 1,06,000 ఉన్నాయి.

2021 -22 సంవత్సరంలో వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లకు ఎంతమంది దరఖాస్తు చేసుకున్నారు?

ఎస్ఇ : గత సంవత్సరం దరఖాస్తు చేసుకున్న వారందరికీ వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లు పూర్తిస్థాయిలో ఇచ్చాం. ఏప్రిల్ మే నెలలో 15 పెండింగ్లో ఉన్నాయి. మే జూన్ నెలలో 850 పెండింగ్లో ఉన్నాయి.

ఎపి ఎస్‌పిడిసిఎల్‌లో ఎంతమంది ఉద్యోగులు పనిచేస్తున్నారు?

ఎస్ఇ : ఎపి ఎస్‌పిడిసిఎల్‌లో కర్నూలు ఉమ్మడి జిల్లాలో రెగ్యులర్ ఉద్యోగులు 1650 మంది, కాంట్రాక్టు ఉద్యోగులు 1600 మంది ఉద్యోగులు పనిచేస్తున్నారు.

ప్రతి రోజు ఎంత విద్యుత్తు వినియోగం అవుతుంది?

ఎస్ఇ : రోజుకు 13 మిలియన్ యూనిట్లు విద్యుత్తు వినియోగిస్తున్నారు.

ప్రభుత్వ కార్యాలయం నుండి విద్యుత్ బిల్లుల ఎంత పెండింగ్ ఉన్నాయి?

ఎస్ఇ : రెండు జిల్లాల నుండిప్రభుత్వ కార్యాలయం నుండి రూ.120 కోట్లు, ప్రైవేటు వారి నుండి రూ.130 కోట్ల మొత్తం రూ.250 కోట్లు బకాయిలు ఉన్నాయి. ఇటీవల గురు రాఘవేంద్ర ప్రాజెక్టు నుండి రూ.20 కోట్ల వసూల్ అయ్యాయి. వినియోగదారుల నుండి ప్రతినెల బిల్లులు సక్రమంగా వసూలవుతున్నాయి.

రిజిస్టర్ కాంట్రాక్టర్లు ఎంతమంది ఉన్నారు?

ఎస్ఇ : రిజిస్టర్ కాంట్రాక్టర్లు వందమంది ఉన్నారు.

ఎన్ని సబ్ స్టేషన్ లో ఉన్నాయి? మెరుగైన విద్యుత్తును వినియోగదారులకు అందించేందుకు ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?

ఎస్ఇ: ఉమ్మడి జిల్లాలో 245 సబ్ స్టేషన్‌లు ఉన్నాయి. మెరుగైన విద్యుత్తు వినియోగదారులకు అందించేందుకు ఉద్యోగులను పని ప్రదేశాల్లోనే ఉండేటట్లు చర్యలు తీసుకున్నాం. ఎప్పటికప్పుడు ముందుగా లైన్లను పరిశీలించి, అవసరాన్ని బట్టి అదనపు ట్రాన్స్ఫార్మర్లను ఏర్పాటు చేస్తున్నాం. ట్రాన్స్ఫార్మర్లు కాలిపోతే టౌన్‌లో 12 గంటల లోపు, గ్రామీణ ప్రాంతాలలో24 గంటల్లో ట్రాన్స్ఫార్మర్లను మారుస్తున్నాం. ఎప్పుడు ఎక్కడ ఎలాంటి సమస్య వచ్చినా వెంటనే సరి చేసే విధంగా సిబ్బందిని సిద్ధంగా ఉంచాం. విద్యుత్తు అంతరాయం లేకుండా వినియోగదారులకు అందిస్తున్నాం.

విద్యుత్ సమస్యలు ఎన్ని పరిష్కరించారు?

ఎస్ఇ : విద్యుత్ సమస్యలు ఎప్పటికప్పుడు పరిష్కరిస్తున్నాం. ఇళ్ల మీద ఉన్న లైన్ల సమస్య మాత్రమే పెండింగ్‌లో ఉన్నాయి.

అక్రమ కనెక్షన్లు ఎన్ని ఉన్నాయి?

ఎస్ఇ : అక్రమ కనెక్షన్లు లేవు. అక్రమ కనెక్షన్ లో ఉన్నట్టు మా దష్టికి వస్తే వెంటనే తొలగించి కేసులు బుక్ చేస్తున్నాం.

సర్దుబాటు పేరుతో విద్యుత్తు వినియోగదారులపై ఎంత భారం వేశారు?

ఎస్ఇ : సర్దుబాటు పేరుతో జూన్ నెలలో ప్రజలపై రూ.162 కోట్లు భారం పడింది.

వర్షాకాలంలో ప్రమాదాలు జరగకుండా ఉండేందుకు ఎలాంటి జాగ్రత్తలు తీసుకుంటున్నారు?

ఎస్ఇ : వర్షాకాలంలో విద్యుత్తు ద్వారా ప్రమాదాలు జరగకుండా ముందు జాగ్రత్త చర్యల్లో భాగంగా ప్రజల్లో అవగాహన కల్పించే కార్యక్రమాలు చేస్తున్నాం. ప్రతి గృహ వినియోగదారులు ఇళ్లలో క్వాలిటీ గల స్విచ్చులు, ప్లగ్గులను వాడాలి. ఎర్తింగు తప్పనిసరిగా ఏర్పాటు చేసుకోవాలి. గాలి వాన పడ్డ సందర్భాల్లో తీగలు తెగిపడవచు. అలాంటి సందర్భాల్లో ఎవరు కూడా తడి చేతులతో పట్టుకోరాదు, పచ్చి కర్రలతో తొలగించరాదు. ప్రతి ట్రాన్స్ఫార్మర్ దగ్గర ఎర్తింగ్ ఏర్పాటు చేసుకోవాలి. విద్యుత్ తీగల ద్వారా ఏమైనా ప్రమాదాలు జరిగే అవకాశం ఉన్నట్లయితే వెంటనే సమీపంలోని సబ్ స్టేషన్ కానీ, ఏఈకి గాని తెలియజేయాలి. శిక్షణ పొందిన విద్యుత్ శాఖకు చెందిన వారు మాత్రమే స్తంభాలను ఎక్కాలని మిగతావారు ఎక్కి ప్రమాదాలు కొని తెచ్చుకోవద్దు. అత్యవసర పరిస్థితులలో 1912కు ఫోన్ చేసి తెలపాలి. వినియోగదారులు సకాలంలో బిల్లులు చెల్లించి నాణ్యమైన విద్యుత్తును అంతరాయం లేకుండా అందించేందుకు, సంస్థ అబివృద్ధికి పాటుపడాలి.



సిఐటియు ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం

ప్రజాశక్తి - నంద్యాల

సిఐటియు రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షులు కామ్రేడ్ పర్సా సత్యనారాయణ శతజయంతి ఉత్సవాల సందర్భంగా ఆదివారం నంద్యాల పట్టణంలోని సిఐటియు జిల్లా కార్యాలయంలో రక్తదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సిఐటియు పట్టణ అధ్యక్షుడు లక్ష్మణ్ అధ్యక్షత వహించారు. రక్తదాన శిబిరంలో 40 మంది పాల్గొని రక్తదానం చేశారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వి.ఏసురత్నం, ఎ.నాగరాజు, రైతు సంఘం జిల్లా అధ్యక్షులు టి.రమేష్ కుమార్‌లు మాట్లాడారు. రాష్ట్రవ్యాప్తంగా సిఐటియు గత 6 సంవత్సరాలుగా రక్తదానం శిబిరాన్ని నిర్వహిస్తుందని తెలిపారు. ప్రజల ఆస్తితో నిర్మించిన ప్రభుత్వ రంగ సంస్థల రక్షణ కోసం సిఐటియు పోరాడుతుందని తెలిపారు. మరోపక్క ద్రోహం చేస్తున్న ప్రభుత్వాల దుర్మార్గ వైఖరిని నిరసిస్తూ అనేక పోరాటాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. పేదలకు, గర్భిణీలకు, తలసేమియా వ్యాధిగ్రస్తులకు రక్తదానం చేయడంలో సిఐటియు తనవంతు పాత్ర ప్రతిరోజూ పోషిస్తూనే ఉందన్నారు. రక్తదానం చేయడం వలన అనేక ప్రయోజనాలు ఉన్నాయని తెలిపారు. రక్తదానం చేసే వారికి గుండెపోటు వచ్చే అవకాశం కూడా చాలా తక్కువని అనేక అధ్యయనాలు వెల్లడిస్తున్నాయని చెప్పారు. అధిక ఐరన్‌ను తగ్గించడంలో, మానసిక ఒత్తిడిని ఎదుర్కొనడంలో రక్తదానం ఎంతో ఉపకరిస్తుందని తెలిపారు. రాబోయే కాలంలో కార్మికులు పోరాటాలలోకి విస్తృతంగా రావాలని, అలాగే ప్రజలు ఇతర అనారోగ్యాలతో అవసరమైన వారందరికీ రక్తం అందించడంలో కూడా ముందుకు రావాలని కోరారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా నాయకులు తోటమద్దులు, కె.మహమ్మద్ గౌస్, ఎల్లయ్య, బాల వెంకట్, వెంకట లింగం, తిరుపతయ్య, రామ్ నాయక్, శివరాం, వైబి వెంకటేశ్వర్లు, సిపిఎం పట్టణ కార్యదర్శి పుల్లా నరసింహ, ప్రజా సంఘాల నాయకులు లక్ష్మణ్, నాగూర్, జైలాన్, వెంకట్రావు, కార్యకర్తలు పాల్గొన్నారు.



'పోరుకేక'కు సంఘీభావంగా విరాళాల సేకరణ

ప్రజాశక్తి - శ్రీశైలం

పోలవరం నిర్వాసితుల పోరుకేక మహా పాదయాత్రకు సంఘీభావం ప్రకటిస్తూ సిపిఎం శ్రీశైలం మండల కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం విరాళాల సేకరణ చేపట్టారు. ఈ సందర్భంగా మండల నాయకులు మునిపాటి చిన్న మారెన్న, యం.మల్లికార్జున మట్లాడుతూ రాష్ట్రానికి జీవనాడిగా పిలువబడుతున్న పోలవరం ప్రాజెక్టు నిర్మాణం కోసం సర్వస్వం త్యాగం చేసిన నిర్వాసితులకు 2013 చట్టం ప్రకారం తక్షణమే పునరావాసం, పరిహారం చెల్లించాలన్నారు. సేకరించిన విరాళాలను రాష్ట్ర కమిటీకి అందజేస్తామన్నారు. కార్యక్రమంలో. నాయకులు జి.మల్లికార్జున, నాగవెంకటేశ్, బి.వెంకటస్వామి, బాలరాజు, పౌలయ్య, గాలేయ్య, ఆవులయ్య, గంగులు, నారాయణ, మనోహర్, శ్రీనివాస్, భీమలింగడు, మౌలాలి, వెంగయ్య, చిన్న వెంకటనారయణ, చిన్న గంగులు, రాంజీనాయక్, రంగస్వామి. పాల్గొన్నారు.



నేడు 'జగనన్నకు చెబుదాం-స్పందన'

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

నేడు నంద్యాల కలెక్టరేట్‌లోని వైఎస్సార్ సెంటినరీ హాలులో వినూత్న రీతిలో 'జగనన్నకు చెబుదాం-స్పందన' కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ మనజిర్ జిలాని సమూన్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

అప్పుల బాధ తాళలేక రైతు ఆత్మహత్య

ప్రజాశక్తి - చాగలమర్రి

మండలంలోని ముత్యాలపాడు గ్రామానికి చెందిన రైతు నరసింహ (39) అప్పుల బాధ తాళలేక ఇంట్లో ఫ్యానుకు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన ఆదివారం చోటు చేసుకుంది. కుటుంబీకులు తెలిపిన వివరాల మేరకు.. గ్రామానికి చెందిన రైతు నరసింహ గత కొన్ని సంవత్సరాలుగా జామ తోట సాగు చేస్తున్నాడు. పంట సాగు కోసం చేసిన అప్పులు అధికమవ్వడంతో తనకున్న 60 సెంట్ల పొలాన్ని అమ్మేశాడు. అయినా చేసేదేమి లేక పొలం కౌలుకు తీసుకుని జామ తోటను సాగు చేశాడు. గత కొన్నేళ్లుగా నష్టాలు రావడంతో దాదాపు రూ. 7 లక్షలు మిగిలాయి. అప్పులు ఎలా తీర్చాలోనని మదనపడుతూ ఇంట్లో ఫ్యానుకు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడికి ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. అందులో ఇద్దరు కుమార్తెలకు వివాహం చేశారు. ఒక కుమార్తె ఉంది. భార్య నరసమ్మ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.


నరసింహ(ఫైల్)

ఎంఆర్‌సి సిబ్బందికి బకాయిలు చెల్లించాలి

ప్రజాశక్తి - ఆత్మకూరు : ఆత్మకూరు, శ్రీశైలం మండలాలకు సంబంధించిన ఎంఆర్‌సి సిబ్బందికి బకాయిలు వెంటనే చెల్లించాలని గిరిజన ఉపాధ్యాయ సంఘం నాయకులు జవహర్ నాయక్ డిమాండ్ చేశారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ అధికారులు జోక్యం చేసుకొని ఎంఆర్‌సి సిబ్బందికి సంబంధించిన జగనన్న విద్యా కానుక కిట్ల డబ్బులు, ప్రభుత్వం వారికి మంజూరు చేసిన పారితోషికం వెంటనే చెల్లించేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

సేవాగుణంలో తల్లిదండ్రుల బాటలో కూతురు

ప్రజాశక్తి - డోన్ : సేవాగుణంలో తల్లిదండ్రుల బాటలోనే కూతురు ఎం.జాహ్నవి నడుచుకోవడం అభినందనీయమని ఇన్నర్ వీల్ క్లబ్ ప్రెసిడెంట్ షాలిని, సెక్రటరీ ఆర్టీసీ ఆర్ఎ.శాంతిలు అన్నారు. ఆదివారం డోన్ పట్టణంలోని నెహ్రూనగర్‌లో ఉంటున్న కర్నూలు జిల్లా క్లస్టర్ యూనివర్సిటీ ఎగ్జిక్యూటివ్ మెంబర్ ఎం.నాగభూషణం రెడ్డి, ఇన్నర్ వీల్ క్లబ్ మాజీ అధ్యక్షురాలు ఎం.శైలజ దంపతుల కుమార్తె ఎం.జాహ్నవి ఇన్నర్ వీల్ క్లబ్ ఆధ్వర్యంలో పేద విద్యార్థి చంద్రశేఖర్ చదువు నిమిత్తం రూ.6 వేలు ఆర్థిక సహాయం అందజేశారు. అనంతరం విద్యార్థి తల్లి దాత ఎం.జాహ్నవికి, ఇన్నర్‌వీల్ క్లబ్ సభ్యులకు కృతజ్ఞతలు తెలియచేశారు. కార్యక్రమంలో ఇన్నర్ వీల్ క్లబ్ మాజీ సెక్రటరీ పి.పద్మ తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థి చంద్రశేఖర్‌కు రూ. 6 వేలు అందజేస్తున్న ఎం.జాహ్నవి


ఈ నెలా భారమే..

- కొనసాగనున్న విద్యుత్ భారాలు
- సామాన్యులకు తీవ్ర భారం

ప్రజాశక్తి-కర్నూలు ప్రతినిధి

ప్రభుత్వం వివిధ పేర్లతో మోపిన విద్యుత్ భారం ఈ నెల కూడా కొనసాగనుంది. ట్రూఅప్, ఎఫ్‌పిపిసిఎ భారాలు వేయడంతో సామాన్యులపై తీవ్ర భారం పడనుంది...

వివిధ రూపాల్లో ప్రజలపై భారాలు మోపుతున్న రాష్ట్ర ప్రభుత్వం విద్యుత్ బిల్లుల్లో వివిధ పేర్లతో సామాన్యులపై బాదుడు వేసింది. ఫ్యూయల్ అండ్ పవర్ పర్చేజ్ కాస్ట్ అడ్జస్ట్‌మెంట్ (ఎఫ్‌పిపిసిఎ) పేరుతో ఈ నెల నుంచి సామాన్యులపై విద్యుత్ బిల్లులో భారాన్ని మోపింది. ఆ భారం ఈ నెల విద్యుత్ బిల్లుల్లోనూ కొనసాగనుంది. ఉమ్మడి కర్నూలు జిల్లా వ్యాప్తంగా 14,26,915 విద్యుత్ కనెక్షన్లు ఉన్నాయి. వాటిలో 11,19,459 గృహ విద్యుత్ (ఎల్‌టి1), 1,25,378 వాణిజ్య (ఎల్‌టి2) కనెక్షన్లు, 7,630 పారిశ్రామిక (ఎల్‌టి3) కనెక్షన్లు, 23,370 సాధారణ ప్రభుత్వ (ఎల్‌టి4) కనెక్షన్లు ఉన్నాయి. 2014-15 ఆర్థిక సంవత్సరం నుంచి 2018-19 ఆర్థిక సంవత్సరం వరకు వాడుకున్న విద్యుత్ వినియోగాన్ని 18 ఇన్‌స్టాల్‌మెంట్స్‌గా తీసి ట్రూ అప్ చార్జీలు యూనిట్‌కు అప్పట్లో వినియోగించిన యూనిట్‌కు కొన్ని పైసల చొప్పున వసూలు చేస్తున్నారని విద్యుత్ శాఖ చెబుతోంది. 2021-2022 సంవత్సరంలో ఏప్రిల్, మే, జూన్‌లో వాడుకున్న వినియోగానికి సంబంధించి అప్పట్లో వాడుకున్న వినియోగానికి యూనిట్‌కు 23 పైసలు చొప్పున ట్రూఅప్ భారం విధించారు. ఆ నెలకు సంబంధించిన విద్యుత్ బిల్లు జూన్ నెలలో వచ్చింది. అందులో సామాన్యులపై పెంపు భారం పడింది. గత ఏడాది ఆగష్టు నుంచే తొలి విడత ట్రూఅప్ ఛార్జీలను వసూలు చేస్తుండగా ఈ నెల నుంచి రెండో విడత ట్రూఅప్ ఛార్జీలను వసూలు చేస్తుండటంతో సామాన్యులపై అదనపు భారం పడుతోంది. మరో వైపు ఫ్యూయల్ అండ్ పవర్ పర్చేజి కాస్ట్ అడ్జస్ట్‌మెంట్(ఎఫ్‌పిపిసిఎ) రూపంలోనూ రాష్ట్ర ప్రభుత్వం వినియోగదారులపై తీవ్ర భారం మోపింది. 2023 ఏప్రిల్‌లో వినియోగించుకున్న వినియోగానికి యూనిట్‌కు 40 పైసలు చొప్పునకింద అదనపు చార్జీలు జూన్‌లో వసూలు చేశారు. ఇవి విద్యుత్ వినియోగదారుడికి అదనపు భారంగా మారింది. ఉమ్మడి కర్నూలు జిల్లా వ్యాప్తంగా ఒక్క నెలలోనే రూ.8.97 కోట్ల రూపంలో ఎఫ్‌పిపిసిఎ భారం వేసింది. ఈ భారాలు జులై నెలలో వచ్చే విద్యుత్ బిల్లుల్లోనూ భారం కొనసాగనుంది. దీంతో సామాన్యులపై తీవ్ర భారం పడనుంది.



అర్హులందరికీ సంక్షేమ పథకాలు

- ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి, జిల్లా పరిషత్ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి

ప్రజాశక్తి - కొలిమిగుండ్ల

అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించడమే వైసిపి ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి, జిల్లా పరిషత్ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి అన్నారు. ఆదివారం కొలిమిగుండ్ల మండలం నందిపాడు సచివాలయం పరిధిలో కల్వటాల గ్రామంలో నిర్వహించిన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో వారు పాల్గొన్నారు. ముందుగా ఎమ్మెల్యే, జిల్లా పరిషత్ చైర్మన్‌లకు గ్రామ నాయకుడు తిమ్మారెడ్డి ఆధ్వర్యంలో నాయకులు కార్యకర్తలు ఘనస్వాగతం పలికారు. అనంతరం వారు ఇంటింటికి వెళ్లి జగనన్న అందిస్తున్న సంక్షేమ పథకాల పనితీరును గ్రామ ప్రజలతో స్వయంగా అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అర్హులైన వారికి ఇంకా ప్రభుత్వ సంక్షేమ పథకాలు లబ్ధి పొందనట్లయితే జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా లబ్ధి పొందాలని ప్రజలకు తెలిపారు. కార్యక్రమంలో ఎంపిడిఒ ప్రసాద్ రెడ్డి, తహశీల్దార్ అల్ఫ్రెడ్, వైసిపి జిల్లా ప్రచార అధ్యక్షుడు పేరం సత్యనారాయణ రెడ్డి, మండల కన్వీనర్ అంబటి గురివి రెడ్డి, లాయర్ మహేశ్వర్ రెడ్డి, మండల పరిషత్ ఉపాధ్యక్షుడు కృష్ణారెడ్డి, ఉప సర్పంచ్ చిన్నన్న, కల్వటాల నాయకులు కామిని తిమ్మా రెడ్డి, కామిని గోపాల్ రెడ్డి, కామిని గజ్జెల రెడ్డి, పాలగిరి రామచంద్ర రెడ్డి, షేక్ ఘాయిబ్ షా వలి, ఉసేన్ బాషా, అఫ్సర్ బాషా, దూదేకుల బాల మద్దిలేటి, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు, గృహ సారథులు పాల్గొన్నారు.


సంక్షేమ పథకాలు వివరిస్తున్న ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి, జిల్లా పరిషత్ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి

కనీస వేతనం అమలు చేయాలి : ఐఎఫ్‌టియు

ప్రజాశక్తి - శ్రీశైలం ప్రాజెక్టు : గ్రామ సచివాలయంలో పని చేస్తున్న సిబ్బందికి, కాంట్రాక్ట్, ఔట్సోర్సింగ్, వాలంటీర్లకు కనీస వేతన చట్టాన్ని అమలు చేసి జీతాలు పెంచాలని ఐఎఫ్‌టియు ఉమ్మడి జిల్లా అధ్యక్షులు వై.ఆశీర్వాదం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం సుండిపెంట కాలనీలో స్థానిక ఐఎఫ్టియు కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. 32 వేల జనాభా కలిగిన గ్రామంలో పారిశుధ్య పనులు కేవలం పది మంది మాత్రమే చేస్తున్నారని, అయితే వారికి జీతం మాత్రం కేవలం రూ. 6 వేలు ఇస్తుండడం దారుణమన్నారు. శ్రీశైలం గ్రామ పంచాయతీ పరిధిలో ఔట్సోర్సింగ్ మున్సిపాలిటీ కార్మికులకు శ్రమకు తగ్గ జీతాలు ఇవ్వట్లేదని చెప్పారు. ఇప్పటికే ఆరు నెలలైనా సచివాలయ సిబ్బందికి జీతాలు ఇవ్వలేదని తెలిపారు. కార్మికులకు జీతాలు పెంచాలని, కనీస వేతన చట్టాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు.


రొట్టె పప్పు గుడ్డు పంపిణీ చేస్తున్న జాన ప్రభాకర్

పౌష్టికాహారం పంపిణీ

ప్రజాశక్తి - డోన్ : డోన్‌లోని గవర్నమెంట్ హాస్పిటల్‌లో గర్భిణులకు, బాలింతలకు, రోగులకు రొట్టె, పప్పు, గుడ్డు పౌష్టికాహారాన్ని శ్రీ రాధాకృష్ణ స్వీట్ షాప్ ప్రొప్రైటర్ చిదాంబరం ఆర్థిక సహాయంతో ప్రార్థన సమయం ఆధ్వరంయలో నిర్వాహకులు జాన. ప్రభాకర్ ఆదివారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఆదివారం దాతల సహాయ సహకారాలతో ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చే వారికి రొట్టె, పప్పు, గుడ్డు ఇస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ఎల్లయ్య, చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

నేడు అమ్మవారికి శాకాంబరి ఉత్సవం

ప్రజాశక్తి - మహానంది

మహానంది పుణ్యక్షేత్రంలో వెలసిన శ్రీ కామేశ్వరి దేవి అమ్మవారికి ఆషాడ శుద్ధ పౌర్ణమి సోమవారం రోజున ప్రత్యేక శాకాంబరి అలంకరణలో పూజలు నిర్వహిస్తున్నట్లు ఆలయ వేద పండితులు ఆదివారం తెలిపారు. అమ్మవారికి శాకాంబరి ఉత్సవం ఆలయ ఈవో చంద్రశేఖర్ రెడ్డి, పాలకమండలి చైర్మన్ మహేశ్వర్ రెడ్డిల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించనున్నట్లు చెప్పారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

- ఇరుక్కుపోయిన ట్రాక్టర్లు - చాకచక్యంగా వ్యవహరించిన ఎస్ఐ

ప్రజాశక్తి - వెలుగోడు : వెలుగోడు మండలం బోయరేవుల గ్రామం దగ్గర శనివారం రాత్రి రెండు ట్రాక్టర్లు ఢీకొన్నన ప్రమాదంలో వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. ముందు వెళ్తున్న ట్రాక్టర్‌ను వెనక వైపు వేగంగా వస్తున్న ట్రాక్టర్ ఢీకొట్టింది. అనంతరం ట్రాక్టర్ ముందు ట్రాక్టర్‌పైకి ఎక్కింది. దీంతో దేవులాపురం గ్రామానికి చెందిన రామలింగంకు గాయాలయ్యాయి. సమాచారం తెలుసున్న ఎస్ఐ జగన్‌మోహన్ సంఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని గమనించారు. వెంటనే జెసిబితో సహాయంతో చాకచక్యంగా వ్యవహరించి ట్రాక్టర్ కింద పడిన మరో ఇద్దరు వ్యక్తులను బయటకి తీసి రక్షించారు.


ట్రాక్టర్ కింద ఇరుక్కున్న వారిని కాపాడుతున్న ఎస్ఐ



అమీర్ భాషను సత్కరిస్తున్న రోటరీ ఆరోగ్య వేదిక సభ్యులు

యువత క్రీడలకూ ప్రాధాన్యతనివ్వాలి

ప్రజాశక్తి - ఆళ్లగడ్డ : యువత కేవలం చదువే కాకుండా క్రీడలకు కూడా ప్రాధాన్యం ఇవ్వాలని ప్రైవేట్ పాఠశాలల మేనేజ్మెంట్ అసోసియేషన్ డివిజన్ అధ్యక్షులు అమీర్ భాష అన్నారు. పట్టణంలోని రోటరీ ఆరోగ్య వేదిక వద్ద ఆదివారం ప్రత్యేక ఏరోబిక్స్ వ్యాయామ శిక్షణ కార్యక్రమాలను నిర్వహించారు. ముఖ్యఅతిథిగా అమీర్ భాషా పాల్గొని మాట్లాడారు. నేటి దైనందిన జీవితాలలో చదువు తప్ప ఆటపాటలకు విద్యార్థులు దూరమవుతున్నారని అన్నారు. రోటరీ ఆరోగ్య వేదిక వ్యవస్థాపకులు డాక్టర్ రాంగోపాల్ రెడ్డి యోగ ఆరోగ్య శిబిరాలను ప్రతివారం ఏర్పాటు చేస్తూ ఎంతో కృషి చేస్తున్నారని ప్రశంసించారు. ఐడిఎస్ పాఠశాల విద్యార్థులచే నిర్వహించిన జుంబా డాన్స్ ప్రదర్శన అందరినీ ఆకట్టుకుంది. రోటరీ క్లబ్ అధ్యక్షుడు పేరూరు విజయ్ కుమార్, ఆరోగ్య వేదిక సభ్యులు ముఖ్యఅతిథి అమీర్ భాషను శాలువాతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు వినోద్ కుమార్, డాక్టర్ ప్రసాద్, రోటరీ క్లబ్ అధ్యక్షుడు విజయ్ కుమార్, ఎల్ఐసి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

జిపిఎస్‌ను రద్దు చేయాలి : ఎస్‌టియు

ప్రజాశక్తి - ప్యాపిలి : గ్యారెంటీ పెన్షన్ స్కీమ్‌ను ఉపాధ్యాయులు అంగీకరించబోరని, పాత పద్ధతినే అమలు చేయాలని ఎస్‌టియు రాష్ట్ర సహాధ్యక్షులు చంద్రశేఖర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఎస్‌టియు ప్యాపిలి ప్రాంతీయ కార్యాలయంలో ప్రమోషన్‌పై, బదిలీపై మండలానికి వచ్చిన ఉపాధ్యాయులకు, బదిలీపై వెళ్లిన వారిని ఆదివారం ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఎస్‌టియు రాష్ట్ర కార్యదర్శి ఇక్బాల్ బాషా, జిల్లా సహాధ్యక్షులు నరసింహ, జిల్లా ఉపాధ్యక్షుడు వెంకట నాయక్, ప్రధానోపాధ్యాయులు సురేష్ బాబు, సీనియర్ నాయకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రజలకు ఇబ్బందులు లేకుండా చేస్తాం : చైర్మన్

ప్రజాశక్తి - డోన్ : డోన్ పట్టణంలోని నల్లగుట్ట, శ్రీరామనగర్ కాలనీల ప్రజలు వర్షపు నీటి వలన ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా మున్సిపాలిటీ తరపున చర్యలు తీసుకుంటామని మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్ తెలిపారు. ఆదివారం పట్టణంలోని శ్రీరామనగర్, నల్లగుట్ట కాలనీలలో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల కురిసిన భారీ వర్షానికి కాలనీలలో ప్రజలు పడుతున్న ఇబ్బందులను గుర్తించి శానిటేషన్ సిబ్బందికి, ఇంజనీరింగ్ సెక్షన్ సిబ్బందికి తగు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. జెసిబి, శానిటేషన్ సిబ్బంది ద్వారా ఆగి ఉన్న వర్షపు నీటిని క్లియర్ చేయించామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ వెంకటరామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పనులను పరిశీలిస్తున్న మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్



వైసిపిలో వీడని గ్రూపుల పోరు

- ఒకే కార్యక్రమాన్ని రెండుసార్లు వేర్వేరుగా నిర్వహించిన వైనం
- ఉదయం ఎమ్మెల్యే ఆర్థర్.. మధ్యాహ్నం సిద్ధార్థ రెడ్డి గ్రూపు వారు..

ప్రజాశక్తి - పగిడ్యాల

సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్నా నందికొట్కూరు నియోజకవర్గంలో అధికార వైసిపిలో గ్రూపుల పోరు వీడడం లేదు. 2019 ఎన్నికల్లో బైరెడ్డి సిద్ధార్థ రెడ్డి వైసిపి అభ్యర్థి గెలుపునకు కృషి చేశారు. దీంతో అప్పట్లో వైసిపి అభ్యర్థిగా పోటీ చేసిన తోగూరు ఆర్థర్ భారీ మెజార్టీతో గెలుపొందారు. ఎన్నికల అనంతరం రెండు గ్రూపులుగా విడిపోయారు. అప్పటి నుంచి ఏ ప్రభుత్వ కార్యక్రమాలు చేపట్టినా వేరువేరుగానే నిర్వహిస్తున్నారు. దీంతో అధికారులకు తలనొప్పిగా మారడమే కాక వైసిపి కిందిస్థాయి కార్యకర్తలు ఎటువైపు వెళ్ళాలో తెలియక సతమతమవుతున్నారు.

పగిడ్యాల మండలం శాప్ చైర్మన్ బైరెడ్డి సిద్ధార్థ రెడ్డి సొంత మండలం. దీంతో ఈ మండలంలో బైరెడ్డి సిద్ధార్థ రెడ్డి గ్రూపు ఆధిపత్యం కొనసాగుతోంది. ఎమ్మెల్యే ఆర్థర్ ఏ కార్యక్రమం నిర్వహించినా ఆ కార్యక్రమానికి హాజరు కాకపోవడంతో పాటు వాలంటీర్లను కూడా హాజరుకాకుండా చేస్తున్నారు. అలాగే ఈ నెల 1వ తేదీన నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమం ఎమ్మెల్యే, బైరెడ్డి సిద్ధార్థ రెడ్డి గ్రూపులు ఒకే కార్యక్రమాన్ని వేరువేరుగా నిర్వహించారు. ఒక గ్రూపు వారు ఉదయం, మరో గ్రూపు వారు మధ్యాహ్నం నిర్వహించడంతో స్థానిక ప్రజలు అవాక్కయ్యారు. ఒకే పార్టీలో ఉండి అందులో అధికార పార్టీ అయిన వైసిపిలో ఉండి సిఎం జగన్ మోహన్ రెడ్డి ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన ప్రభుత్వ పథకాలను ప్రజలకు అందేలా చూడాల్సింది పోయి గ్రూపుల పోరులో వేరువేరుగా నిర్వహించడంపై చర్చనీయాంశంగా మారింది. సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో నందికొట్కూరు నియోజవర్గంలో శాప్ చైర్మన్ బైరెడ్డి సిద్ధార్థ రెడ్డి, ఎమ్మెల్యే తోగూరు ఆర్థర్ గ్రూపుల పోరు వీడకపోతే రాబోయే ఎన్నికల్లో తీవ్ర నష్టం జరిగే అవకాశం లేక పోలేదని స్థానిక వైసిపి నాయకులు, కార్యకర్తలు పేర్కొంటున్నారు. వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో మళ్లీ తోగూరు ఆర్థర్‌కే వైసిపి టికెట్టు వస్తుందని ఆ గ్రూపు నాయకులు చెప్పుకుంటున్నారు. నందికొట్కూరు నియోజవర్గం వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థిగా మళ్లీ ఆర్థర్‌కే అధిష్టానం ఖరారు చేసిందని బహిరంగ ప్రచారం చేస్తున్నారు. అయితే నియోజకవర్గంలో శాప్ చైర్మన్ బైరెడ్డి సిద్ధార్థ రెడ్డికి అనుచర బలంగంతో పాటు ప్రజాదరణ అధికంగా ఉందని, ఆయన ఎవరి పేరు చెబితే వారికే వైసిపి అధిష్టానం నందికొట్కూరు నియోజవర్గ అభ్యర్థిగా ఖరారు చేస్తుందని సిద్ధార్థ రెడ్డి గ్రూపు వారు చెబుతున్నారు. గ్రూపుల పోరు వలన కలిసి పని చెయ్యకపోవడంతోనే స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రాతకోట, నెహ్రూ నగర్ గ్రామ సర్పంచు స్థానాలు, లక్ష్మాపురం ఎంపిటిసి స్థానాలు కోల్పోయామని వైసిపి కార్యకర్తలు చెబుతున్నారు. ఇప్పటికైనా గ్రూపుల పోరు వీడాలని, లేకపోతే రాబోయే ఎన్నికల్లో వైసిపికి భారీ నష్టం జరిగే అవకాశం ఉందని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.



ఉదయం జగనన్న సురక్ష కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే ఆర్థర్ (ఫైల్)



మధ్యాహ్నం జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహిస్తున్న సిద్ధార్థ రెడ్డి గ్రూపు నాయకులు (ఫైల్)

అబద్ధపు వాగ్దానాలతో గద్దెనెక్కిన మోడీ : కాంగ్రెస్

ప్రజాశక్తి - ఆళ్లగడ్డ

అధికారంలోకి రాకముందు ఎన్నో హామీలు ఇచ్చి గద్దెనెక్కిన కేంద్రంలోని మోడీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఆ హామీలన్నింటినీ విస్మరించిందని డిసిసి అధ్యక్షులు లక్ష్మీ నరసింహ యాదవ్ విమర్శించారు. ఆదివారం పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆళ్లగడ్డ నియోజకవర్గ నాయకులు, కార్యకర్తలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా లక్ష్మీ నరసింహ యాదవ్ పాల్గొని ప్రసంగించారు. కేంద్ర ప్రభుత్వం పెంచిన పెట్రోలు, డీజిల్, గ్యాస్ ధరలను, విద్యుత్ చార్జీలను వెంటనే తగ్గించాలని డిమాండ్ చేశారు. రైతులకు ఉచిత విద్యుత్తును కొనసాగించాలన్నారు. 23 మంది ఎంపీలను గెలిపిస్తే కేంద్రంలో ఏ ప్రభుత్వం వచ్చినా మెడలు వంచి ప్రత్యేక హోదాను సాధిస్తామని చెప్పిన ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ప్రధాని మోడీ మోకాళ్ల దగ్గర మోకరిల్లడం తెలుగు ప్రజల ఆత్మగౌరవాన్ని తాకట్టు పెట్టడమే అన్నారు. రాష్ట్రానికి ప్రత్యేక హోదా, రాయలసీమకు ప్రత్యేక ప్యాకేజీ తేవడంలో విఫలమైన ఎంపీలు వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఫీజు రీయంబర్స్మెంట్ పథకాన్ని యధావిధిగా కొనసాగించాలన్నారు. సిద్దేశ్వరం అలుగు, గుండ్రేవుల రిజర్వాయర్, వేదవతి ప్రాజెక్టులను వెంటనే పూర్తి చేయాలన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఎయిడెడ్ విద్యాసంస్థలకు పూర్వ వైభవం తీసుకువచ్చి చట్టబద్ధత కల్పించాలన్నారు. కాంట్రాక్ట్ ఉద్యోగస్తులను రెగ్యులరైజ్ చేయాలని, బిసి కుల గణన చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం ఆళ్లగడ్డ మండల అధ్యక్షుడు హుస్సేన్ భాష అధ్వర్యంలో పలువురు యువ నాయకులు పార్టీలో చేరారు. లక్ష్మీ నరసింహ వారికి కాంగ్రెస్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో నంద్యాల జిల్లా ఉపాధ్యక్షుడు గంధం మల్లేశ్వరరెడ్డి, ఆళ్లగడ్డ మండల అధ్యక్షుడు బరగొడ్ల హుస్సేన్ బాషా, నియోజకవర్గం కో ఆర్డినేషన్ సభ్యులు చాకలి పుల్లయ్య, రాష్ట్ర మైనార్టీ కార్యదర్శి శంసుల్ హక్, పార్టీ అనుబంధ సంస్థల అధ్యక్షులు పటాన్ హబీబ్ ఖాన్, నాగలింగమ్, సంపంగి రామకృష్ణ, రుద్రవరం మండల అధ్యక్షుడు శ్రీనివాసులు, ఉయ్యాలవాడ మండల అధ్యక్షుడు వెంకటసుబ్బయ్య, సోషల్ మీడియా కో ఆర్డినేటర్ సంజీవ కుమార్, నాగయ్య, మధు, వెంకటరాముడు, నాగేంద్ర, బాలకృష్ణ, రంగస్వామి, సిద్దిక్ తదితరులు పాల్గొన్నారు.

కోవెలకుంట్ల : వచ్చే ఎన్నికల్లో ఆంధ్రప్రదేశ్‌లో కాంగ్రెస్ పార్టీ పూర్వ వైభవానికి కృషి చేస్తామని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు జె.లక్ష్మీ నరసింహ యాదవ్, బనగానపల్లె ఇంచార్జ్ బాలు యాదవ్ పేర్కొన్నారు. బనగానపల్లె ఇంచార్జ్ బాలు యాదవ్ ఆధ్వర్యంలో కోవెలకుంటలోని పార్టీ కార్యాలయంలో జరిగిన కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయానికి కృషి చేస్తామన్నారు. ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షులు నాగలింగం, జిల్లా అధ్యక్షుడు మైనార్టీ జిల్లా అధ్యక్షులు పఠాన్ ఖాన్, బీసీ సెల్ జిల్లా అధ్యక్షులు రామకష్ణ, చాకలి హుస్సేని, నాయకులు మహిళలు పాల్గొన్నారు.



సన్మానిస్తున్న దృశ్యం

దళితులపై పెరిగిన దాడులు, దౌర్జన్యాలు : డిహెచ్‌పిఎస్

ప్రజాశక్తి - నంద్యాల అర్బన్

రాష్ట్రంలో జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుండి దళితులపై దాడులు, దౌర్జన్యాలు పెరిగాయని, వాటిని అరికట్టడంలో పూర్తిగా విఫలమైందని దళిత హక్కుల పోరాట సమితి గౌరవాధ్యక్షులు కె.ప్రసాద్, జిల్లా నాయకులు ఇ.చెన్నయ్య, కొమ్ము ప్రభాకర్‌లు విమర్శించారు. ఆదివారం స్థానిక సిపిఐ కార్యాలయంలో దళిత హక్కుల పోరాట సమితి ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ఈ నెల 7న స్థానిక స్వామి రెడ్డి భవన్‌లో దళిత హక్కుల పోరాట సమితి జిల్లా జనరల్ బాడీ సమావేశం జరుగుతుందని తెలిపారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా దళితహక్కుల పోరాట సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కరవది సుబ్బారావు, ఉపాధ్యక్షులు గురుదాస్, సిపిఐ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్.రంగనాయుడు, పట్టణ కార్యదర్శి కె.ప్రసాద్‌లు హాజరవుతారని తెలిపారు. ఈ సమావేశానికి దళిత హక్కుల పోరాట సమితి జిల్లా నాయకులు, కార్యకర్తలు, దళిత మేధావులు అధిక సంఖ్యలో హాజరై జయప్రదం చేయాలని కోరారు. సమావేశంలో పట్టణ ఉపాధ్యక్షులు సుభాష్, కార్యదర్శి నాగేంద్ర, సహాయ కార్యదర్శి సుబ్బారాయుడు తదితరులు పాల్గొన్నారు



మాట్లాడుతున్న దళిత హక్కుల పోరాట సమితి నాయకులు

సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలి : ఐఎఫ్‌టియు

ప్రజాశక్తి - నంద్యాల

భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలని ఐఎఫ్‌టియు జిల్లా సహాయ కార్యదర్శి ఎం శంకర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఐఎఫ్టియు ముఖ్య నాయకుల సమావేశం ఆదివారం స్థానిక ఎపిటిఎఫ్ కార్యాలయంలో ఇర్ఫాన్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో వైసీపీ ప్రభుత్వం కార్మికుల సంక్షేమాన్ని గాలికి వదిలేసిందని విమర్శించారు. భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డు బిఓసిన్లోని వేలాది కోట్ల రూపాయలను ఇతర రంగాలకు దారి మళ్ళించిందని తెలిపారు. భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ పథకాలను అమలు చేయకుండా ప్రభుత్వం కార్మిక ద్రోహానికి పాల్పడిందని విమర్శించారు. భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డులోని నిధులను కార్మికుల సంక్షేమానికి మాత్రమే వినియోగించాలని డిమాండ్ చేశారు. బిఓసిలో దాదాపు 28 వేల క్లైములు పెండింగ్‌లో ఉన్నాయని, వాటిని తక్షణమే పరిష్కరించి నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో ఐఎఫ్‌టియు కార్యదర్శి ఇర్ఫాన్ భాష, పిడిఎస్యు ఉమ్మడి జిల్లా అధ్యక్షులు ఎస్ఎండి రఫీ, మహబూబ్ బాషా, మున్నా, సయ్యద్, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.



విత్తనం చేస్తున్న రైతులు

కురుస్తున్న వర్షాలు.. విత్తులో రైతన్న

ప్రజాశక్తి - మిడుతూరు

మిడుతూరు మండలంలోని నాగటూటి, పైపాలెం గ్రామాల్లో వర్షం పడటంతో ఆదివారం పత్తి, మొక్కజొన్న, కంది విత్తనాలను పొలాల్లో రైతులు నాటించారు. ఇంకా మండలంలో దాదాపు 8 నుంచి 10 గ్రామాల్లో వర్షం సరిగా లేక పునాస విత్తనాలు విత్తడం లేదని కొందరు రైతులు వాపోతున్నారు. వర్షాలు ఇకనైనా బాగా వస్తే పంటలు వేసుకోవడానికి అనుకూలంగా ఉంటుందని చెప్పారు.

పోలీసు అధికారుల అవినీతిపై ఐజికి ఫిర్యాదు చేస్తాం : సిపిఐ

ప్రజాశక్తి - నంద్యాల : నంద్యాల జిల్లాలో పోలీసు ఉన్నతాధికారుల అండదండలతోనే రేషన్ అక్రమ విక్రయదారులు బియ్యాన్ని ఇతర రాష్ట్రాలకు తరలిస్తున్నారని, అవినీతి పోలీస్ అధికారులపై రాష్ట్ర ఐజికి ఫిర్యాదు చేస్తామని సిపిఐ జిల్లా కార్యదర్శి ఎన్.రంగనాయుడు, జిల్లా సహాయ కార్యదర్శి. ఎస్.బాబా పకద్దీన్ పేర్కొన్నారు. ఆదివారం వారు విలేకరులతో మాట్లాడుతూ వెలుగోడుకు చెందిన అధికార పార్టీ ప్రజాప్రతినిధి కనుసనలలో దళారుల ద్వారా రేషన్ బియ్యాన్ని అతి తక్కువ రేటుకు సేకరించి రైస్ మిల్లు ద్వారా సన్న బియ్యంగా తయారు చేసి ఎక్కువ రేటుకు ఇతర ప్రాంతాలకు అమ్ముతున్నారని తెలిపారు. ఈయనకు దళారీగా క్రైమ్ పార్టీకి చెందిన పోలీస్ ఉన్నత అధికారి వ్యవహరించడం సిగ్గుచేటన్నారు. నంద్యాల పట్టణంలో ఇతర ప్రాంతాలకు చెందిన కొంతమంది మహిళలు రేషన్ బియ్యాన్ని ఇంటింటికి వెళ్లి కొంటుంటే వారిని బెదిరించి రాకుండా అధికార పార్టీ నాయకులు ప్రయత్నించి వారే కొని వెలుగోడు పట్టణంలోని అధికార పార్టీకి చెందిన నేత రైస్ మిల్లులకు తరలిస్తున్నారని ఆరోపించారు. రేషన్ బియ్యం తరలింపులో పోలీసులు ఉన్నారనే నెపంతో తూతూ మంత్రంలా ఇద్దరు పోలీసులను సస్పెండ్ చేసి ప్రధాన బాధ్యులైన ఉన్నత అధికారిని తప్పించారని, ఇలాంటి అక్రమార్కులపై రాష్ట్ర పోలీసు అధికారులు సమగ్ర విచారణ జరిపించి తగిన చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.

ఆటో డ్రైవర్ నిజాయతీ

ప్రజాశక్తి - బనగానపల్లె : ఆటో డ్రైవర్ సుధాకర్‌కు బ్యాగు దొరకడంతో పోలీస్ స్టేషన్‌లో ఎస్సై రామిరెడ్డికి అప్పజెప్పి తన నిజాయితీని చాటుకున్నారు. వివరాలు.. ఆదివారం మండలంలోని చెరువుపల్లె గ్రామానికి చెందిన జమీదాబి బనగానపల్లె పట్టణంలో తన బ్యాగు పోగొట్టుకుంది. ఆ బ్యాగు ఆటో డ్రైవర్ సుధాకర్‌కు దొరికింది. బ్యాగులో నగదు, ఒక మొబైల్ ఫోన్ ఉంది. బ్యాగును ఆటో డ్రైవర్ బనగానపల్లె పోలీసు స్టేషన్‌లో ఎస్ఐ రామిరెడ్డికి అప్పజెప్పారు. ఎస్సై రామిరెడ్డి జమీదాబిని పిలిపించి బ్యాగును ఆటో డ్రైవర్ ద్వారా ఆమెకు అప్పగించారు. నిజాయతీగా బ్యాగును అందజేసిన ఆటో డ్రైవర్‌ను ఎస్సై, పోలీసులు అభినందించారు.



బాధితురాలికి బ్యాగ్ అందజేస్తున్న ఆటో డ్రైవర్

నూతన వైద్యశాలలకు అనారోగ్యం

- ఎమ్మెల్యే ప్రారంభించినా నిరుపయోగమే..
- పిహెచ్‌సికి వైద్యులు, సిబ్బందిని నియమించని వైనం
- నిర్మాణం పూర్తయినా ప్రారంభానికి నోచని వైఎస్ఆర్ ఆరోగ్య కేంద్రం

ప్రజాశక్తి - ఆత్మకూర్

రాష్ట్ర ప్రభుత్వం ప్రతి ఇంటికీ వైద్య సేవలు అందిస్తున్నామని పెద్ద ఎత్తున ప్రచారం చేసుకుంటున్నది తప్ప లక్షల రూపాయలతో నిర్మించిన ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు ప్రజలకు అందుబాటులోకి రావడం లేదు. ఆత్మకూరు పట్టణం, మండలంలోని కురుకుందలో నిర్మించిన ప్రభుత్వ వైద్యశాలలు ఉపయోగంలోకి రాలేదు. ఆత్మకూరు మండలంలోని జడ్పిటిసి శంకర్ రెడ్డి సొంత గ్రామం కురుకుందలో గత ప్రభుత్వంలో ఎంఎస్‌డిపి 83 లక్షల 40 వేల రూపాయలతో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని నిర్మించారు. అనంతరం ప్రస్తుత ప్రభుత్వంలో గత సంవత్సరం శ్రీశైలం శాసనసభ్యులు శిల్పా చక్రపాణి రెడ్డి ప్రారంభించారు. నాటి నుండి నేటి వరకు ఆ వైద్యశాలకు అవసరమైన వైద్యులను, సిబ్బందిని ప్రభుత్వం కేటాయించకపోవడంతో నాడు వేసిన తాళాలు నేటికీ తెరుచుకోలేదు. ఈ వైద్యశాల నిర్మించిన కాంట్రాక్టర్‌కు ఇంతవరకు బిల్లులు రాకపోవడంతో హైకోర్టును ఆశ్రయించాడు. నేడు ఈ వైద్యశాల ఆవరణంలో మద్యం ప్రియులు చీకటి పడితే ఇక్కడే మద్యం సేవించడం, ఇతర అసాంఘిక కార్యక్రమాలకు నిలయంగా మారిందని కురుకుంద గ్రామానికి చెందిన పలువురు ప్రజలు ఆరోపిస్తున్నారు. అలాగే ఆత్మకూర్ పట్టణంలోని అర్బన్ కాలనీలో 85 లక్షల రూపాయలతో నిర్మించిన ఆయుష్మాన్ భారత్ హెల్త్ వెల్నెస్ సెంటర్, డాక్టర్ వైయస్సార్ పట్టణ ఆరోగ్య కేంద్రం నిర్మించి ఆరు నెలలు పూర్తి అవుతున్నప్పటికీ ప్రారంభానికి నోచుకోలేదు. సంబంధిత కాంట్రాక్టర్లకు ఇంతవరకు బిల్లులు రాకపోవడంతో నిర్మించిన వైద్యశాల భవనాలను అధికారులకు అప్పగించలేదు. లక్షలాది రూపాయలతో నిర్మించిన భవనాలను వినియోగంలోకి తీసుకురాకపోవడంతో అవి అసాంఘిక కార్యక్రమాలకు నిలయంగా మారుతున్నాయి. ప్రజా ప్రతినిధులు, అధికారులు ఇప్పటికైనా స్పందించి రెండు ప్రాథమిక వైద్యశాలలను వెంటనే తెరిపించి సంబంధిత వైద్య సిబ్బందిని కేటాయించి వైద్య సేవలు ప్రజలకు అందుబాటులో తీసుకురావాలని పలువురు కోరుతున్నారు.



ఏడాది క్రితం ఎమ్మెల్యే ప్రారంభించినా మూతపడి ఉన్న ప్రాథమిక వైద్య కేంద్రం



ఆత్మకూరులో నిర్మాణం పూర్తయ్యి ప్రారంభానికి నోచని వైఎస్ఆర్ ఆరోగ్య కేంద్రం

సత్తా లేని పవన్ వైఎస్ జగన్‌ను ఎలా ఓడిస్తారు

- మాజీ ప్రభుత్వ విప్ గంగుల, ఎమ్మెల్యే నాని

ప్రజాశక్తి - చాగలమర్రి

రాష్ట్రంలోని అన్ని అసెంబ్లీ స్థానాలకు పోటీ చేసే సత్తా లేని జనసేన పార్టీ అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డిని వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో ఎలా ఓడిస్తారని మాజీ ప్రభుత్వ విప్ గంగుల ప్రభాకర్ రెడ్డి, ఆళ్లగడ్డ శాసనసభ్యులు గంగుల బిజేంద్రా రెడ్డిలు సూటిగా ప్రశ్నించారు. ఆదివారం చాగలమర్రిలో మండల కో ఆప్షన్ సభ్యుడు జిగ్గిగారి ఇబ్రహీం ఇంట్లో జరిగిన ఒక శుభ కార్యక్రమానికి వారు కుటుంబ సమేతంగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు విలేకరులతో మాట్లాడుతూ పొత్తుల కోసం ప్రాకులాడకుండా దమ్ము ధైర్యం ఉంటే 175 అసెంబ్లీ స్థానాలకు పవన్ పార్టీ పోటీ చేయాలని సవాల్ విసిరారు. ఉభయ గోదావరి జిల్లాలో వైసిపికి ఒక ఎమ్మెల్యే సీటు రాకుండా చూస్తానని అయన ఉత్తర కుమారుని ప్రగల్బాలు పలుకుతున్నారని దుయ్యబట్టారు. పవన్‌కు రాజకీయ అనుభవం లేకపోవడంతో ఒక చోట ఒక్కో విధంగా మాట్లాడుతున్నారని ధ్వజమెత్తారు. ఆయన మాటలు విని ప్రజలు నవ్వుకుంటున్నారన్నారు. కులాలను ప్రస్తావిస్తూ రెచ్చగొట్టే ప్రసంగాలు చేస్తున్నాడన్నారు. పవన్, చంద్రబాబు ఏకమైనా సిఎం జగన్‌మోమన్ రెడ్డిని ఓడించలేరని వారు ధీమా వ్యక్తం చేశారు. మండలంలోని నేలంపాడు మీదుగా గొట్లూరు వరకు కొత్త రోడ్డు నిర్మాణ పనులు పూర్తి కావస్తున్నాయని అన్నారు. పెద్ద భోధనం నుండి తోడేళ్లపల్లె వరకు బీటీ రోడ్డు నిర్మాణానికి ప్రభుత్వం 3 కోట్ల 56 లక్షల రూపాయలు మంజూరు చేసిందని తెలిపారు. కార్యక్రమంలో వైసిపి రాష్ట్ర మైనార్టీ సెల్ ప్రధాన కార్యదర్శి షేక్ బాబులాల్, మండల కన్వీనర్ కుమార్ రెడ్డి, చాగలమర్రి ఉప సర్పంచ్ షేక్ సోహైల్, మండల ఉపాధ్యక్షుడు ముల్లా రఫీ, మండల కో ఆప్షన్ సభ్యుడు జిగ్గి గారి ఇబ్రహీం, గొడుగునూరు ఎంపిటిసి పత్తి నారాయణ, సేవ దళ్ అధ్యక్షుడు గణేష్ రెడ్డి, నాయకులు భారత్ గ్యాస్ రఫీ, గేట్ల మహబూబ్, ముల్లా ఖాదర్బాషా, చక్రం ముల్లా షబ్బీర్, వెంకటరమణ, షేక్ షబ్బీర్, దాదా బీడీ కాజా, ముల్లా బురందీన్, కొండయ్య, అబ్దుల్లా, షేక్షావలి, దేవేంద్రారెడ్డి రమేష్, దాబా మనోహర్ రెడ్డి, పెయింటర్ షరీఫ్, ఖదీర్, శ్రీనివాసులు, జల్సా గౌస్, బబ్లు, మండల ప్రచార కార్యదర్శి పెయింటర్ రఫీ తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్నమాజీ ప్రభుత్వ విప్ గంగుల, ఎమ్మెల్యే నాని





నంద్యాల : జ్యోతి ప్రజ్వలన చేస్తున్న డాక్టర్ రవికృష్ణ

ఘనంగా వైద్యుల దినోత్సవం

ప్రజాశక్తి - నంద్యాల : నంద్యాల పట్టణంలోని సూరజ్ గ్రాండ్ హోటల్ సమావేశ మందిరంలో జాతీయ వైద్యుల దినోత్సవాన్ని ఐఎంఎ ఆధ్వర్యంలో అధ్యక్షులు డాక్టర్ జఫరుల్లా అధ్యక్షతన ఘనంగా నిర్వహించారు. ఐఎంఎ రాష్ట్ర పెసిడెంట్ డాక్టర్ రవికృష్ణ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఫణిధర్, రాష్ట్ర ఫైనాన్స్ కార్యదర్శి డాక్టర్ రవీంద్రనాథ్‌లు ముఖ్యఅతిధులుగా పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేసి ఉత్సవాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా డాక్టర్ బిసి.రాయ్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. రాష్ట్ర శాఖ తరపున ఐఎంఎ వైద్యుల దినోత్సవ పురస్కారాలను వైద్యులకు అందజేసి సన్మానించారు. కార్యక్రమంలో ఐఎంఎ రాష్ట్ర వర్కింగ్ కమిటీ సభ్యులు, అధిక సంఖ్యలో వైద్యులు కుటుంబ సభ్యులతో కలిసి పాల్గొన్నారు. **ఆళ్లగడ్డ :** జాతీయ వైద్యుల దినోత్సవం సందర్భంగా ఆళ్లగడ్డ డాక్టర్స్ అసోసియేషన్ తరపున వైద్యులను ఘనంగా సన్మానం నిర్వహించారు. బిసి రాయ్‌ని స్మరించుకొని సీనియర్ వైద్యులు రామ క్రిష్ణారెడ్డి, సుబ్బారెడ్డి, కృష్ణమూర్తి, రామ గోపాల్ రెడ్డి, ఎంవి.ప్రసాద్‌లను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో వైద్యులు వసంత, సుజాత, ఉమాదేవి, సుధ, ఏవి రామ సుబ్రమణ్యం, శేఖర్ రెడ్డి, కృష్ణమోహన్ రెడ్డి, సుదర్శన్ రెడ్డి, ఆయుర్వేద వైద్యులు ప్రసాద్, సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

ఆళ్లగడ్డ : వైద్యులను సన్మానిస్తున్న దృశ్యం



భూములు ఆక్రమించినవి కావు.. కొన్నవి..

- కూల్చివేతలు ఆపాలి : బాధితులు

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

నంద్యాల జిల్లా కేంద్రంలోని నూనెపల్లె, రైతు నగరం ఏరియాల్లోని వక్ఫ్ స్థలాల్లో అక్రమంగా నిర్మాణాలు చేపట్టారని వక్ఫ్ అధికారులు చేపడుతున్న కూల్చివేతలపైన తీవ్ర నిరసన వ్యక్తం అవుతుంది. బాధితులు తాము ఎక్కడ కూడా వక్ఫ్ స్థలాలను ఆక్రమించుకోలేదని, ఇతరుల నుండి కొనుగోలు చేసుకొని రిజిస్టార్ భూముల్లోనే ఇళ్లు, చిన్న చిన్న షాప్‌లు నిర్మాణాలు చేసుకొని ఉంటున్నామని, చెప్పా పెట్టకుండా సడన్‌గా వచ్చి లక్షలు పెట్టి నిర్మించుకున్న నిర్మాణాలను వక్ఫ్ బోర్డు అధికారులు కూల్చడం అన్యాయమని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గతంలో ఇలాగే కూల్చడానికి అధికారులు వస్తే కోర్టుల నుండి స్టే తెచ్చుకున్నామని, ఆ స్టే వివరాలు చూపిస్తున్నా అధికారులు వినకుండా కూల్చడం ఏమిటని బాధితులు ప్రశ్నిస్తున్నారు. శనివారం మధ్యాహ్నం నేషనల్ హైవేపైన ఉన్న పంజాబ్ డాబాను, ఎదురుగా ఉన్న కట్టడాలను యజమానులకు ముందస్తు సమాచారం లేకుండా కూల్చి వేశారని వాపోయారు. ప్రభుత్వానికి రిజిస్టార్ చలానాలు కట్టామని, అక్రణలు ఎలా అవుతాయని, చివరకు కలెక్టర్ ను కలిసి తమ బాధను చెప్పుకోవడానికి కూడా అధికారులు అవకాశం ఇవ్వలేదని బాధితులు వాపోయారు. అధికారుల చర్యల వలన దాదాపు వంద కుటుంబాలు బజారున పడనున్నాయి. నిర్మాణాలు, భవనాల కూల్చివేత ప్రభావం స్థానిక ఎమ్మెల్యే శిల్పా రవి చంద్ర కిశోర్‌రెడ్డిపై పడనుందనే అభిప్రాయం వ్యక్తం అవుతుంది. ఎమ్మెల్యే జోక్యం చేసుకొని ఇప్పటికైనా ఈ కూల్చివేతలకు ఫుల్ స్టాప్ పెట్టకపోతే వచ్చే ఎన్నికల్లో ఈ ప్రభావం చూపకపోదనే చర్చకు తెర లేసింది. వక్ఫ్ భూములు ఎక్కడెక్కడ ఆక్రమణకు గురయ్యాయి, ఏఏ సర్వే నంబర్‌లలో ఇంకా వక్ఫ్ భూములున్నాయి, వాటి పరిరక్షణకు తీసుకోవాల్సిన చర్యలపై మైనార్టీ అధికారులు కుస్తీ పడుతున్నారు.



కూల్చివేతల వద్ద బాధితులు